RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

| మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 124 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ | బుధవారం,నవంబర్,5,2025 | పేజీలు : 8 వెల : రూ.4/- |
|---|---|---|---|---|---|
| MALKAJGIRI | VOLUME : 3 | ISSUE NO : 124 | EDITOR : MERUGU CHANDRAMOHAN | Wednesday,November,5,2025 | PAGES : 8 RS : 4/- |




## జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారం

## కూలీలకు రూ.600, విద్యార్థులకు

# రోజుకు రూ.1000

**హైదరాబాద్, నవంబర్ 04,తెలంగాణ దిశ :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంతో దినసరి కూలీల అడ్డాలు ఖాళీగా మారాయి. రాజకీయ పార్టీలు ప్రచారానికి, పోస్టర్ల అంటించడానికి దినసరి కూలీలను వినియోగించు కుంటున్నాయి. రోజుకు రూ. 400-800 వరకు చెల్లిస్తూ, భోజనం కూడా పెడుతుండటంతో కూలీలు ఎన్నికల ప్రచారానికే మొగ్గు చూపుతున్నారు.

విద్యార్థులకు కూడా ఇంటింటి ప్రచారం, ఓటర్ల జాబితా పరిశీలన పనులకు గాను రూ. 1000 చొప్పున చెల్లిస్తున్నారు. దీంతోవిద్యార్థులు, దినసరి కూలీలు ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. జూబ్లీహిల్స్‌లో ఉప ఎన్నికకు సమయం దగ్గర పడుతోంది.




## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో అమెజాన్ వెబ్ సర్వీసెస్

# ప్రతినిధుల భేటీ

- తెలంగాణలో ఏడబ్ల్యూఎస్ సెంటర్లు, విస్తరణపై చర్చ
- పెట్టుబడుల విషయంలో ప్రభుత్వ సహకారం ఉంటుందని హామీ
- ముఖ్యమంత్రితో జర్మనీ కాన్సుల్ జనరల్ బృందం భేటీ

**హైదరాబాద్, నవంబర్ 04,తెలంగాణ దిశ :** అమెజాన్ వెబ్ సర్వీసెస్ ప్రతినిధి బృందం తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమైంది. తెలంగాణలో ఏడబ్ల్యూ ఎస్ ఆన్ గోయింగ్ సెంటర్లు, వాటి విస్తరణపై చర్చించింది. ఈ సమావేశానికి ఏడబ్ల్యూఎస్ డేటా సెంటర్ గ్లోబల్ హెడ్, ఇన్‌ఫ్రా పబ్లిక్ పాలసీ డైరెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమ ంత్రి మాట్లాడుతూ, పెట్టుబడుల విషయంలో ప్రభుత్వ సహాయ సహకారాలు ఉంటాయని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రితో జర్మనీ కాన్సుల్ జనరల్ బృందం భేటీ: జర్మనీ కాన్సుల్ జనరల్ మైఖేల్ హాస్పర్ బృందం కూడా ముఖ్యమంత్రితో సమావేశమైంది. హైదరాబాద్‌లో జీసీసీని ప్రారంభిస్తున్నట్లు ముఖ్యమంత్రికి తెలిపింది. డ్యూయిష్ బోర్స్ కంపెనీ విస్తరణలో భాగంగా హైదరాబాద్‌లో జీసీసీని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించింది.



## పార్టీ మారిన ఎమ్మెల్యేలపై

# విచారణ

## మరోమారు షెడ్యూల్ ప్రకటించిన స్పీకర్

## ఈ నెల 6నుంచి వరుసగా విచారణలకు సిద్ధం

**హైదరాబాద్, నవంబర్ 04,తెలంగాణ దిశ :** తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చనీ యాంశంగా మారిన పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు విచారణలో మరో అడుగు పడింది. ఎల్లుండి నుండి ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు విచారణ జరుగ నుంది. ఈనెల 6 నుంచి ఈ కేసును స్పీకర్ గడ్డం ప్రసా ద్ కుమార్ విచారించనున్నారు. పార్టీ మారిన ఎమ్మె ల్యేల అనర్హత పిటిషన్లపై విచారణకు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ షెడ్యూల్ ఇచ్చారు. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ గుర్తుపై గెలిచిన పదిమంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసింది.



## వ్యవసాయం మనజీవన విధానంలో

# భాగం

- 54 శాతం జనాభా వ్యవసాయంపై ఆధారపడి జీవనం
- దేశ జీడీపీలో 18 శాతం భాగస్వామ్యం కలిగి ఉంది
- 149 మిలియన్ టన్నుల ధాన్యం ఉత్పత్తితో ప్రపంచంలోనే తొలిస్థానం
- అగ్రి బిజినెస్ అవార్డుల ప్రదానంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**హైదరాబాద్, నవంబర్ 04,తెలంగాణ దిశ :** దేశంలో ఎన్ని మార్పులు వచ్చినా.. వ్యవసాయం ఇప్పటికీ మన జీవన విధానంలో భాగమేనని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. దేశంలోని 54 శాతం జనాభా ఇప్పటికీ వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని చెప్పకొచ్చారు. వ్యవసాయ రంగం దేశ జీడీపీలో 18 శాతం భాగస్వామ్యం కలిగి ఉందని వివరించారు. అగ్రి బిజినెస్ అవార్డులు ఇవ్వడం ద్వారా భారతదేశ వ్యవసాయరంగానికి ఎనలేని సేవలు అందిస్తున్న రైతులకు, ఇన్నోవేటర్స్, అగ్రిప్రెన్యూర్స్‌ని గౌరవించు కోవడమేనని పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్ పార్క్ హయత్ హోటల్‌లో అగ్రి బిజినెస్ అవార్డుల కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. రైతులు సుభిక్షంగా ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ బలంగా నమ్ముతారని నొక్కిచెప్పారు. అందుకే అనేక పథకాలు రైతులకు మేలు చేసేలా రూపొందించారని తెలిపారు. ఈ ఏడాది చైనాను దాటేసి 149 మిలియన్ టన్నుల ధాన్యం ఉత్పత్తితో భారతదేశం ప్రపంచంలోనే తొలిస్థానంలో నిలిచిందని ఉద్ఘాటించారు.

## తెలంగాణలో క్రీడా ప్రోత్సాహక

# విధానాలు

## బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభించిన మంత్రి వాకిటి




**హైదరాబాద్, నవంబర్ 04,తెలంగాణ దిశ :** తెలంగాణ ప్రభుత్వ క్రీడా ప్రోత్సాహక విధానాల వల్లనే పలు జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీలకు హైదరాబాద్ వేదికగా మారుతోందని రాష్ట్ర క్రీడలు, యువజనసర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన 'తెలంగాణ ఇండియా ఇంటర్నేషనల్ చాలెంజ్ 2025' బ్యాడ్మింటన్ పోటీలను మంత్రి శ్రీహరి ప్రారంభించారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడు తూ,ప్రభుత్వం క్రీడల ప్రోత్సాహక విధానాన్ని అమలు చేస్తోంది. దాని ఫలితంగా హైదరాబాద్ మాత్రమే కాకుండా తెలంగాణలోని పలు జిల్లాల్లో కూడా భవిష్యత్తులో జాతీయ,అంతర్జాతీయ క్రీడా టోర్నమెంట్లు నిర్వహించే ప్రణాళిక ఉందని తెలిపారు. పభు త్వ క్రీడల సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి మాట్లాడు తూ, హైదరాబాద్ అనేక బ్యాడ్మింటన్ ఛాంపియన్ల ను అందించిన ఘనత తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీకి దక్కిందని అన్నారు. స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి మాట్లాడుతూ, ఈ టోర్నమెంట్ విజయవంతంగా సాగేందుకు స్పోర్ట్స్ అథారిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని, గత రెండేళ్లలో అనేక మెగా ఈవెంట్లను విజయవంతంగా నిర్వహించిన ఘనత సంస్థకు దక్కిందని తెలిపారు.



## బీహార్‌లోనూ ఉచిత పథకాల

# వెల్లువ

- సంక్రాంతి కానుకగా మహిళల ఖాతాల్లో 30వేలు జమ
- మద్దతు ధరలకు అదనంగా 300,400 చెల్లింపులు
- సొంతూరికి 70 కి.మీ దూరంలోనే ఉద్యోగుల బదిలీలు
- మీడియా సమావేశంలో ఆర్‌జెడి నేత తేజస్వీయాదవ్

పాట్నా,నవంబర్4 : బీహార్ ఎన్నికల తరుణంలో ఆర్‌జెడి నేత, మహాగట్బంధన్ ముఖ్యమంత్రి అభ్యర్థిగా బరిలో నిలిచిన తేజస్వియాదవ్ ప్రజలకు వరాల జల్లు కురిపించారు. ముఖ్యంగా రైతులు పండించిన వరి గోధుమలకు ఎంఎస్‌పి ధర కంటే అదనపంగా క్వింటాలకు రూ. 300, 400 చొప్పన చెల్లించనున్నట్లు హామినిచ్చారు. మహిళల బ్యాంకు ఖాతాలో 30 వేల చొప్పన జమ చేస్తామని, ప్రభుత్వ ఉద్యోగులైన పోలీసులు, టీచర్లు, ఆరోగ్య కార్యకర్తల బదిలీలు వారి సొంత ఇంటికి 70 కిలోమీటర్లలోపే బదిలీలు ఉంటాయని ప్రకటించారు. ఇప్పటికే ఇంటికో ఉద్యోగం ప్రకటించిన తేజస్వీ ఎన్‌డిఎ కూటమిని దెబ్బతీసేందుకు అలవికాని హామీలు ఇస్తున్నారు. తాజాగా బిహార్ ఎన్నికల్లో మహిళా ఓటర్లను ఆకట్టుకునేందుకు ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ కీలక హామీ ప్రకటించారు. మంగళవారం తేజస్వియాదవ్ పాట్నాలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ఇండియా కూటమి బిహార్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన వెంటనే 'మై-బహిన్ మాన్ యోజన'ను ప్రారంభిస్తామన్నారు.



# కోమటిరెడ్డి ఎక్కడా..?

**హైదరాబాద్, నవంబర్ 04,తెలంగాణ దిశ :** సీఎం నుంచి మంత్రుల వరకు..ఎమ్మెల్యేల నుంచి కార్పొరేషన్ ఛైర్మన్ల వరకు.. హస్తం పార్టీ చోటామోటా లీడర్లు అంతా జూబ్లీహిల్స్ ప్రచారంలో ఉన్నారు. ఆ ఒక్క ఎమ్మెల్యే మాత్రం అటువైపు కన్నెత్తి చూడటం లేదు. ఏ నేత ప్రచారంలో పాల్గొనకపోయినా ప్రశ్నిస్తున్న పార్టీ పెద్దలు..ఆ ఎమ్మెల్యేకు ఫోన్ చేయాలంటేనే జంకుతున్నారట. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో కాంగ్రెస్ లీడర్లు ఫుల్ బిజీగా ఉన్నారు. మంత్రులతో మొదలుకొని, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ ఛైర్మన్లు, క్యాడర్ మొత్తం రంగంలోకి దిగి గల్లీలు, బస్తీలను చుట్టేస్తు న్నారు. ఒక్కొక్క డివిజన్‌కు ఇద్దరు మంత్రుల చొప్పున మొత్తం ఏడు డివిజన్లకు 14మంది మంత్రులకు బాధ్యతలు అప్పగించారు. మంత్రులతో పాటు ఎమ్మెల్యే లందరికి, కార్పొరేషన్ ఛైర్మన్లు క్యాంపెయిన్ చేస్తు న్నారు. కానీ ఒకే ఒక్క ఎమ్మెల్యే ప్రచారానికి దూరంగా ఉంటున్నా రు. ఆయనే మునుగోడు ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డిఇప్పటివరకు ఆయన జూబ్లీహి ల్స్‌వైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. ఎన్నికల ఆపరేషన్‌లో రాజగోపాల్ రెడ్డి స్ట్రాటజీ సమ్‌థింగ్ స్పెషల్‌గా ఉంటుందని కాంగ్రెస్ పార్టీలో టాక్. అందుకే పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఒక్కొక్క పార్లమెంట్ స్థానాన్ని మంత్రులకు ఇంచార్జ్ బాధ్యతలు అప్పగిస్తే..కేవలం ఎమ్మెల్యేగా ఉన్న రాజగోపాల్ రెడ్డికి భువనగిరి పార్లమెంట్ బాధ్యతలు ఇచ్చారు.

# జనవాసాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు యత్నాన్ని నిలిపివేయాలి

## - ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జాయింట్ కమిషనర్ ఎస్ వై ఖురేషికి వినతి



**నాగారం, నవంబర్ 04, (తెలంగాణ దిశ)** :జనవాసాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటుకు యత్నాన్ని నిలిపివేయాలని కోరుతూ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జాయింట్ కమిషనర్ ఎస్ వై ఖురేషికి మంగళవారం సత్యనారాయణ కాలనీవాసులు సమర్పించిన వినతి పత్రంలో కోరారు. నాగారం మాజీ మున్సిపల్ చైర్మన్, బిజెపి నాయకులు కౌకుట్ల చంద్ర రెడ్డి నాయకత్వంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ప్రధాన కార్యాలయానికి చేరుకొని మద్యం దుకాణం ఏర్పాటు చేయడం వల్ల కలిగే ఇబ్బందులను వివరించారు. మున్సిపల్, హెచ్ఎండిఏ అనుమతులు లేకుండా వైన్స్ ఏర్పాటు చేయడం కోసం భారీ షెడ్డు నిర్మిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కాలనీ ప్రధాన రహదారి అనుకొని ఉన్న సర్వే నెం. 133 లోని ప్లాట్ నెంబర్.5 నుంచి 9వరకు సుమారు 1600 గజాల స్థలంలో అక్రమంగా షెడ్డు నిర్మిస్తున్నారని ఫిర్యాదు చేశారు.

ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి మాట్లాడుతూ కాలనీ జనావాసాల మధ్య మద్యం షాపు ఏర్పాటు చేయడం వల్ల శాంతి భద్రతలకు వివాదం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తాగుబోతుల వీరంగం వల్ల చిన్న పిల్లలు మహిళలు బయటకు వచ్చే పరిస్థితి ఉండదన్నారు. కాలనీలో సుమారు 400 కుటుంబాలు నివసిస్తున్నాయని, సమీపంలోనే మహనీయులు ఎన్టీఆర్, దొడ్డి కొమురయ్య విగ్రహాలు, కృష్ణవేణి స్కూల్, ప్రైవేట్ హాస్పిటల్స్ఉన్నాయని ఆయన అన్నారు. వీటన్నిటి మధ్యలో అధికారులు మద్యం షాపును ఎలా జారీ చేశారని ఆయన ప్రశ్నించారు.

కాలనీమధ్యలో మద్యం షాపు పెడితే పిల్లల భవిష్యత్తు ఏమిటని ఆయన ప్రశ్నించారు. ముఖ్యంగా రాత్రివేళల్లో అశాంతి పెరుగుతుందని ఆయన ఆవేదనవ్యక్తంచేశారు. అధికారులు ఒక్కసారివచ్చి పరిస్థితుల ను గమనించాలని కోరారు. తక్షణమే ఈ నిర్మాణాన్ని ఆపకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు.

# జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం ఖాయం

## - మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు మొగిలి సునీత రావు






**జూబ్లీహిల్స్,నవంబర్ 04, (తెలంగాణ దిశ)** :జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం ఖాయమని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు మొగిలి సునీత రావు అన్నారు. మంగళవారం జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్యాదవ్ విజయాన్ని కాంక్షిస్తూ షేక్పేట్ డివిజన్ బూత్ నంబర్ 58, 59, 60 డివిజన్ లలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్, ఏఐసిసి నేషనల్ వైస్ చైర్మన్ నవాబ్ షేక్ ఇబ్రహీంలతో కలిసి మొగిలి సునీత రావు ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమెమాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలోప్రజలు నవీన్ యాదవ్కు బ్రహ్మరథం పడుతున్నారని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు నవీన్ యాదవ్ విజయానికి సోపానాలని అన్నారు. నవీన్ యాదవ్ గెలుపు ద్వారా జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంఅన్నిరంగాలలో అభివృద్ధి జరుగుతుందని అన్నారు. నవీన్ యాదవ్ ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేశారు. ఒక నాయకుడిగా ప్రజలకు ఎంతో సేవ చేసినా నవీన్ యాదవులు గెలిపించుకుంటే ఎమ్మెల్యేగా మరిన్ని సేవలు అందిస్తారని చెప్పారు. ప్రజల మనిషి నవీన్ యాదవ్ నభారీమెజార్టీతో గెలిపించాలని సునీత రావు ఓటర్లను కోరారు.

మీ కుటుంబంలో ఒక సభ్యుడుగా ఉన్న నవీన్ యాదవ్ చేయ్యి గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని గడపగడపకు ప్రచారం చేసారు. బిజెపి, బిఆర్ఎస్ చెప్పేమాటలను నమ్మవద్దని ఆమె సూచించారు. జూబ్లీహిల్స్లోగత పది సంవత్సరాల నుండి ఎలాంటి అభివృద్ధి చేయలేదని అన్నారు. జూబ్లీహిల్స్ అభివృద్ధి కోసం పనిచేసే నాయకుడు నవీన్ యాదవ్ పిలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రెసిడెంట్స్,బ్లాక్ప్రెసిడెంట్లు. డివిజన్ ప్రెసిడెంట్స్ మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మోసం చేసే పార్టీని కాదు... సంక్షేమం కోసం పనిచేసే బిఆర్ఎస్ ను గెలిపించాలి

## - బిఆర్ఎస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్ రెడ్డి







**జూబ్లీహిల్స్, నవంబర్ 04, (తెలంగాణ దిశ)** :ప్రజలను మోసం చేసే పార్టీకి ఈఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పి ప్రజల సంక్షేమం కోసం పనిచేసే బిఆర్ఎస్ పార్టీని గెలిపించాలని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్ రెడ్డికోరారు. మంగళవారం జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచార పర్వంలో భాగంగా బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ విజయాన్ని చింతల వెంకటేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో బోరబండ డివిజన్ లోని స్వరాజ్ నగర్,బంజారానగర్ బూత్ నంబర్ 322, 330, 331, 332, 333 లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన వాగ్దానాలతో పాటు ఎన్నికల్లో హామీ ఇవ్వని ఎన్నో పనులను, పథకాలను ప్రవేశపెట్టి అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం కృషి చేసిన బిఆర్ఎస్ పార్టీకి పట్టం కట్టాలని కోరారు.

ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేక అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని ఓటర్లకు సూచించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభివృద్ధికి మాగంటి గోపీనాథ్ చేసిన సేవలు మరువలేనివని, ఆయన సేవలు కొనసాగాలంటే నవంబర్ 11న జరగనున్న ఎన్నికల్లో మూడవ నెంబర్ పై ఓటు వేసి బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ ను గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక బూత్ కమిటీ సభ్యులు, బిఆర్ఎస్ నాయకులు, పార్టీ భువనగిరి, కుత్బుల్లాపూర్, ఇంచార్జీలు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నాగారం ఎలిఫెంట్ ఎన్ క్లేవ్ లో డ్రైనేజీ పనులు ప్రారంభం





**నాగారం,నవంబర్ 04, (తెలంగాణ దిశ):** నాగారం మున్సిపల్ పరిధి గోధుమకుంట ఎలిఫెంట్ ఎన్ క్లేవ్ లో రూ. 10లక్షల వ్యయంతో డ్రైనేజీ పనులను కాంగ్రెస్ పార్టీ నాగారం మున్సిపల్ అధ్యక్షులు ముప్పు శ్రీనివాసరెడ్డి, గోధుమ కుంట మాజీ ఎంపిటిసి మంచాల కిరణ్ జ్యోతి ప్రవీణ్ కుమార్ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దశల వారీగా అన్ని వార్డులలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని అన్నారు. కాంగ్రెస్ ప్రజాపాలనలో మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందన్నారు.

ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ కీసర మండల అధ్యక్షురాలు సుమతి, గోధుమకుంట మాజీ వార్డు మెంబర్ చీర శేఖర్,కందాడి శ్రీనివాస్ రెడ్డి, చీర శ్రీశైలం, కాలనీ అధ్యక్షుడు నాగభూషణం, కోశాధికారి రాహుల్, ప్రసాద్, రాజేష్, అనిల్, కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం ఖాయం

## కాంగ్రెస్ పార్టీ దమ్మాయిగూడ మున్సిపల్ వర్కింగ్ ప్రెసిడెంట్ సామల శ్రీనివాస్ రెడ్డి



**దమ్మాయిగూడ,నవంబర్ 04, (తెలంగాణ దిశ):** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం ఖాయమని కాంగ్రెస్ పార్టీ దమ్మాయిగూడ మున్సిపల్ వర్కింగ్ ప్రెసిడెంట్ సామల శ్రీనివాస్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కల్లబొల్లి కబుర్లు చెబుతున్న బిఆర్ఎస్ నేతలను స్థానికులు విశ్వసించడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పట్లప్రజలు పూర్తి విశ్వాసంతో ఉన్నారని శ్రీనివాస్ రెడ్డితెలిపారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేస్తుందన్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించిందన్నారు. అదే విధంగా పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, రూ.500 లకే గ్యాస్ సిలిండర్ అందజేస్తుందన్నారు. అదే విధంగా రైతులకు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ప్రభుత్వ చౌక ధరల దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానిదేనన్నారు. బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు చిన్న శ్రీశైలం యాదవ్ ను బిఆర్ఎస్ పార్టీలో కొనసాగినప్పుడు రౌడీషీటర్ గా కనిపించలేదా అని ఆయన ప్రశ్నించారు. నిత్యం ప్రజా సంక్షేమ కార్యక్రమాలు చేపట్టే నవీన్ యాదవ్ కు జూబ్లీహిల్స్ ప్రజలు నీరాజనం పడుతున్నారని తెలిపారు. ఓటమి తప్పదని భావించిన బిఆర్ఎస్ నేతలు మతిభ్రమించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. జూబ్లీహిల్స్ ప్రజలు అన్ని గమనిస్తున్నారని, ఎన్నికల్లో బిఆర్ఎస్, బిజెపి పార్టీలకు తగిన బుద్ధి చెప్పడం ఖాయమని అన్నారు.

# జర్నలిస్టుల సంక్షేమానికి టిడబ్ల్యూజెఎఫ్ కృషి

## - టిడబ్ల్యూజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్




**కుత్బుల్లాపూర్,నవంబర్ 04,(తెలంగాణ దిశ)** :జర్నలిస్టుల సంక్షేమానికి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజెఎఫ్) కృషి చేస్తుందని రాష్ట్ర కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ అన్నారు మంగళవారం జీడిమెట్ల పరిధిలోని లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం వద్ద ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఐఎఫ్ డబ్ల్యూజె) 75వ ఆవిర్భావ దినోత్సవాలను పురస్కరించుకొని ఏర్పాటు చేసినసమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భం గా శ్రీనివాస్ మాట్లాడుతూజర్నలిస్టుల సమస్యలపై చిత్తశుద్ధితో కృషి చేసేది తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ మాత్రమేనని అన్నారు. రాజకీయ పార్టీలకు అనుబంధంగా కాకుండా ఒక స్వతంత్ర వ్యవస్థలాగా జర్నలిస్టు ఫెడరేషన్ పనిచేస్తుందని అన్నారు. కుత్బుల్లాపూర్ లోని జర్నలిస్టులసమస్యల పరిష్కారానికి ప్రణాళిక బద్ధంగా టిడబ్ల్యూజెఎఫ్ కృషి చేస్తుందని ఆయన అన్నారు. రాష్ట్రంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్జాతీయ స్థాయిలో ఐఎఫ్ డబ్ల్యూజె యూనియన్ కు అనుబంధంగా కొనసాగుతుందని అన్నారు. అనంతరం ఐఎఫ్ డబ్ల్యూజె 75వఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని కేకుకట్ చేసి జర్నలిస్టులు పరస్పరంతినిపించారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజెఎఫ్ జిల్లా నాయకులు దామెరజగదీశ్వర్ గుప్తా, గడ్డమీది అశోక్, కుత్బుల్లాపూర్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు శంకర్, గోవిందరావులు ప్రసంగించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొన్నారు.



# బాత్ రూమ్ లైట్ లో కెమెరా అడ్డంగా చిక్కిన ఓనర్

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** హైదరాబాద్లో షాపింగ్ మాల్స్ ట్రైల్ రూమ్లసీసీ కెమెరాలు పెట్టి అడ్డంగా దొరికిపోయిన ఘటనలు అనేకం, ఆ తరువాత లేడిసీ హాస్టల్స్ , కాలేజి హాస్టల్స్ బాత్ రూమ్ లో సైతం సీసీ కెమెరాలు పెట్టి బుక్కైన సందర్భాలు అనేకం. అయితే తాజాగా హైదరాబాద్ లో అద్దె ఇంటి ఓనర్లు కొందరు బరితెగించి, ఏకంగా టెనెంట్స్ బాత్ రూమ్ లో సీసీ కెమెరాలు పెడుతున్నారు. తాజాగా మధురానగర్ పీఎస్ పరిధిలోని జవహార్ నగర్ లో వెలుగు చూసిన ఘటన హైదరాబాద్ నగరంలో పెను సంచలనంగా మారింది. జవహార్ నగర్ లోని అశొ?క్ యాదవ్ అనే ఇంటి యజమాని తన ఇంట్లో అద్దెకు ఉంటున్నవారి బాత్ రూమ్ లో సీసీ కెమెరాలు అమర్చిన తీరు టెనెంట్స్ లో ఆందోళన కలిగిస్తోంది. జవహార్ నగర్లోని అశోక్ యాదవ్ అనే ఇంటి యజమాని తన ఇంట్లో అద్దెకు ఉంటున్న ఫ్యామిలీని టార్గెట్ చేశాడు. వారి ఇంట్లో ఎవరూ లేని సమయంలో వెళ్లి బాత్ రూమ్ లో సీసీ కెమెరా పెట్టాలని ఫిక్స్ అయ్యాడు. భార్య భర్తలిద్దరూ ఉదయం ఉద్యోగాలకు వెళ్లి, సాయంత్రం ఇంటికి రావడం గమనించాడు. ఈనెల బాత్ రూమ్ లో హోల్డర్స్ మార్చాలి కొత్త హోల్డర్స్ వేయాలంటూ చెప్పి , ఇంటి తాళం తీసుకున్నాడు అశోక్. బాత్ రూమ్ లో లైట్ లోపల సీసీ కెమెరా అమర్చేందుకు ఎలక్ట్రీషియన్ చింటూ సహాయం తీసుకున్నాడు. హోల్డర్ మార్చి, బోల్డర్ లోపల సీసీ కె?మెరా అమర్చారు. సీసీ కెమెరా అమర్చడంతో స్క్రూలు పట్టకపోవడంతో,చుట్టూ టేప్ వేశారు. ఒక్క స్క్రూ మాత్రం బిగించి వదిలేశారు. అలా బాత్ రూమ్ లో ఉన్న బల్బుకు అమర్చిన సీసీ కె?మెరాను ఫోన్ కు అనుసంధానం చేసి, బాత్ రూమ్ లో మహిళ స్నానం చేసే సమయంలో వీడియోలు ఫోన్లో చూసేవాడు. అలా ఫోన్ లో చూసిన వీడియోలను రికార్డ్ చేసేవాడు. ఇలా బాత్ రూమ్ లో సీసీ కెమెరా ద్వారా అద్దెకు ఉంటున్న వివాహిత వీడియోలను గుట్టుచప్పుడు కాకుండా రికార్ట్ చేసేవాడు ఇంటి యజమాని అశోక్ యాదవ్. ఈనెల 4వ తేదీ నుంచి బాత్ రూమ్ బల్బులో సీక్రెట్ గా అమర్చిన సీసీ కెమెరా ద్వారా వీడియోలను ఎలక్ట్రీషియన్ చింటూకు సైతం షేర్ చేసేవాడని సమాచారం. ఇలా గుట్టుచప్పుడు కాకుండా ఇంట్లో అద్దెకు ఉంటున్న వివాహిత వీడియోలను ఫోన్చూస్తూ శునకానందం పొందేవాడు ఇంటి ఓనర్ అశోక్ యాదవ్. బాత్ రూమ్ లో స్నానం చేస్తున్న సమయంలో సీసీ కెమెరా అమర్చిన బల్బు హోల్డర్ నుంచి లైట్ బ్లింక్ అవ్వడం గమనించిన టెనెంట్ ఫ్యామిలీ వెంటనే ఈ విషయాన్ని ఓనర్ కు చెప్పారు. ఇందులో సీసీ కెమెరా పెట్టినట్లు నాకు తెలియదు, ఎలక్ట్రీషియన్ చింటూను అడుగుతానిని చెప్పడంతో, అనుమానం వచ్చిన టెనెంట్ ఫ్యామిలీ షీటీమ్ ను ఆశ్రయించారు.

# సంపాదకీయం

## సాఫ్ట్ వేర్ ఇండస్ట్రీకి ఏమైంది..?

వారంలో ఐదు రోజులు పని.. ఐదు అంకెలకు మించిన జీతం.. బోనస్‌లు.. ఇంక్రిమెంట్లు.. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో సౌకర్యాలు.. కంపెనీ మారితే చాలు శాలరీ హైక్ అయ్యేది. కనివిని ఎరుగని రేంజ్ లో కనక వర్షం కురిసేది. ఐటి ఇండస్ట్రీలో పనిచేసే ఎంప్లాయి ల గురించి పై ఉపోద్ఘాతం మాదిరిగానే చెప్పుకునేవారు.. అంతేకాదు ఐటీ పరిశ్రమలో పనిచేసే వారికి అమ్మాయిలను ఇవ్వడానికి చాలామంది పోటీపడేవారు. కోరినంత కట్నం.. తగినంత బంగారం.. కావలసినంత పొలాలు ఇచ్చేవారు. ఇప్పుడు పరిస్థితి మారిపోయింది.ప్రపంచ వ్యాప్తంగా ఏర్పడుతున్న పరిస్థితులు.. ఐటీ సేవలకు తగ్గిన గిరాకీ.. ఫలితంగా ఐటి పరిశ్రమ తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటోంది. పైగా కృత్రిమ మేధ అందుబాటులోకి రావడంతో చాలామంది ఉద్యోగాలు కోల్పోతున్నారు. గడచిన మూడు సంవత్సరాలుగా ఐటీ పరిశ్రమలో తొలగింపులు తప్ప కొత్త నియామకాలు లేవు. ప్రాంగణ నియామకాలు లేకపోవడంతో చాలామంది నిరుద్యోగులుగా మిగులుతున్నారు. ఒకవేళ నియామకాల ప్రక్రియ జరిగినప్పటికీ ఉద్యోగాలు తక్కువ స్థాయిలో ఉంటున్నాయి. ఇక కోర్ ఇంజనీరింగ్ కు డిమాండ్ తగ్గడంతో చాలామంది సాఫ్ట్వేర్ వైపుకు వస్తున్నారు. దీంతో కోర్సులు చదివేవారు పెరిగిపోతున్నారు. ఉద్యోగాలు వారికి తగ్గట్టుగా లేకపోవడంతో నిరుద్యోగం పెరిగిపోతుంది. ఉద్యోగాల కల్పనలో అంతరం వల్ల యువతలో నిరాశ కనిపిస్తోంది.మూడు సంవత్సరాలుగా ఐటీ ఇండస్ట్రీ తిరోగమనాన్ని ఎదుర్కొంటున్నది. ఇదే అదునుగా కంపెనీలు కూడా అడ్డగోలుగా ఉద్యోగాలలో కోతలు విధిస్తున్నాయి. దీంతో చాలామంది ఉద్యోగాలు లేక ఇబ్బంది పడుతున్నారు. ఇక మన దేశంలో పేరు పొందిన ఐటీ కంపెనీలు ఉద్యోగాల కోత విధిస్తున్నాయి. తాజాగా టిసిఎస్ కంపెనీ కూడా ఉద్యోగాలలో దారుణమైన కోత విధించింది ఆటోమేషన్ యుగంలో కంపెనీ అవసరాలు తీర్చలేని ఉద్యోగులను మొహమాటం లేకుండా బయటికి పంపించేస్తోంది. సంస్థతో దీర్ఘకాలం అనుబంధం కలిగిన ఉద్యోగులకు మాత్రం రెండు సంవత్సరాల పాటు వేతనాన్ని పరిహారంగా ఇస్తోంది. ఈ ఏడాది జూలై నెలలో దాదాపు 12,000 మందికి ఉద్వాసన పలికింది టీసీఎస్. ఇందులో భాగంగానే వారికి 3 నెలల పాటు నోటీస్ పీరియడ్ ఇస్తోంది. ఆ మూడు నెలలకు కంపెనీ ఉద్యోగులకు వేతనం చెల్లిస్తోంది. దీనికి తోడు అదనంగా ఆరు నెలల నుంచి రెండు సంవత్సరాల వరకు పరిహారం ప్యాకేజీ కింద వేతనం చెల్లిస్తోంది. ఎనిమిది నెలలకు మించి బెంచ్ పై ఉండే వారికి సింప్లర్ ప్యాకేజీ అమలు చేస్తోంది. వారికి నోటీస్ పీరియడ్లో ఉన్న వేతనాలు మాత్రమే చెల్లిస్తోంది.సంస్థతో 10 నుంచి 15 సంవత్సరాల అనుబంధం ఉన్న వారు తాజా లే ఆఫ్ లో ఉద్యోగం కోల్పోతే.. వారికి ఏడాదిన్నర పాటు వేతనాన్ని చెల్లిస్తోంది. 15 సంవత్సరాలకు మించి సంస్థతో అనుబంధం ఉన్నవారికి గరిష్టంగా రెండు సంవత్సరాలు పాటు వేదనంగా చెల్లిస్తోంది. అవుట్ ప్లేస్మెంట్ సేవలను కూడా అందిస్తోంది. ఒకవేళ మానసిక ఆరోగ్యం బాగోలేకపోయిన వారికి టిసిఎస్ కేర్ ప్రోగ్రాం కింద చికిత్స లేదా తెరపి అందిస్తోంది. ఒకవేళ రిటర్మెంట్ కు దగ్గర పడిన వారికి ముందస్తు పదవి విరమణకూ అవకాశం కల్పిస్తోంది టిసిఎస్. వీరికి వారి అనుభవాన్ని బట్టి ఆరు నెలల నుంచి రెండు సంవత్సరాల వరకు వేతనాన్ని పరిహారం ప్యాకేజీ కింద చెల్లిస్తోంది. అంతేకాదు బీమా సౌకర్యాన్ని కూడా కల్పిస్తోంది.ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో పనిచేసే ఉద్యోగులకు కష్టాలు మొదలయ్యాయి. ఇప్పటికే టీసీఎస్ వంటి దిగ్గజ సంస్థ ఈ ఆర్థిక సంవత్సరం పూర్తయ్యే నాటికి 12,000 మంది ఉద్యోగులను తొలగించనున్నట్లు ప్రకటించడం పరిశ్రమను షాక్ కు గురి చేసింది. అమెరికా టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ కూడా ఈ ఏడాది ఇప్పటివరకు 15,000 మంది ఉద్యోగులను తొలగించడం చర్చనీయాంశంగా మారింది. ఇప్పుడు నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్ వేర్ అండ్ సర్వీసెస్ కంపెనీస్ మరింత ఆందోళన కలిగించే విషయం చెప్పింది. రాబోయే రోజుల్లో మరిన్ని లేఆఫ్స్ ఉంటాయని అంచనా వేస్తోంది. దీంతో సాఫ్ట్ వేర్ ఉద్యోగుల భవిష్యత్తుపై నీలి నీడలు కమ్ముకున్నాయి. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఆటోమేషన్ కారణంగా టెక్ ఇండస్ట్రీలో భారీ మార్పులు వస్తున్నట్లు నాస్కామ్ తెలిపింది. బెంగళూరులో జరిగిన మీటింగ్ లో ప్రస్తుతం ఐటీ ఇండస్ట్రీలో పరిణామాలపై చర్చించింది. వర్క జరిగే విధానం పూర్తిగా మారిపోతోందని పేర్కొంది. సంప్రదాయ నైపుణ్యాల అవసరం చాలా తక్కువగా ఉంటుందని, కంపెనీలు తమ లక్ష్యాలకు అనుగుణంగా అడ్జస్ట్ అవుతున్నట్లు వివరించింది. ఐటీ ఇండస్ట్రీ ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి సరికొత్త టెక్నాలజీ వైపు వెళ్తోందని నాస్కామ్ ప్రెసిడెంట్ రమేష్ నంబియర్ పేర్కొన్నారు. ఈ మార్పు ద్వారా ఉద్యోగులను ఎక్కువగా నియమించుకోవడంపై జాబ్ గ్రోత్ ఆధారపడదని తెలిపారు. అయితే ఉద్యోగులపై ఎక్కువ ప్రభావం పడకుండా ఉండేలా కంపెనీలకు సాయం చేసేందుకు నాస్కామ్ ప్రణాళికలు రూపొందిస్తోందని చెప్పారు.ఐటీ ఇండస్ట్రీలో రాబోయే రోజుల్లో డిమాండ్ పెరుగుతుందని, అయితే కొత్త నైపుణ్యాలు ఉన్నావారికే అవకాశాలు లభిస్తాయని నాస్కామ్ వైస్ ప్రెసిడెంట్ శ్రీకాంత్ వెలమకన్ని తెలిపారు. ముఖ్యంగా ఏఐ నైపుణ్యాలు అవసరం అన్నారు. క్లయింట్లు ప్రతి సంవత్సరం 15 శాతం మెరుగైన ఉత్పాదక కోరుకుంటున్నారని, కంపెనీలు పాత టెక్నాలజీపై పని చేసే ఉద్యోగులను కోరుకోవని చెప్పారు. అయితే ఎంట్రీ లెవెల్ ఉద్యోగులకు ఇది మంచి అవకాశం అని పేర్కొన్నారు. వారికి కొత్త సాంకేతికతపై శిక్షణ ఇస్తే ఉద్యోగాలు కోల్పోయే ముప్పు ఉండదన్నారు.లేఆఫ్స్ కారణంగా ఉద్యోగాలు కోల్పోతున్న వారిలో ఎక్కుగా మిడ్, హై లెవెల్ ఉద్యోగులే ఉంటున్నారు. ఎంట్రీ లెవెల్ ఉద్యోగులపై ఎక్కువ ప్రభావం లేదు. జీతాలు ఎక్కువగా ఉండటం, కొత్త నైపుణ్యాలు లేకపోవడంతో కంపెనీలు మిడ్, హై లెవెల్ సిబ్బందిని తొలగించి ఖర్చు తగ్గించుకుంటున్నాయి. ఐటీ ఇండస్ట్రీలోనే కొనసాగాలంటే ఎప్పటికప్పుడు అధునాతన సంకేతికతల్లో నైపుణ్యం పెంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

# మహిళలు ఉన్నతమైన పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి



## - మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్త

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 04, (తెలంగాణ దిశ) :**మహిళలు ఉన్నతమైన పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్త సూచించారు. మంగళవారం తెలంగాణ ప్రభుత్వం, బిట్స్ పిలానీ సంయుక్తంగా ప్రోగ్రామ్ ఫర్ రూరల్ అడ్వాన్స్‌మెంట్ గ్రోత్ అండ్ ట్రాన్స్‌ఫర్మేషన్ త్రూ ఇన్నోవేషన్ సెంటర్ (పిఆర్ఎజిఎటీఐ) ఆధ్వర్యంలో జిల్లాలోని 50 మంది ఔత్సాహిక మహిళలకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్త, బిట్స్ పిలానీ డీన్ యోగీశ్వరి జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మహిళల కోసం ఏర్పాటు చేసిన ఈ శిక్షణ కార్యక్రమంలో ప్రస్తుత సమాజంలో మహిళలు వ్యాపార అభివృద్ధిలో ఎదుర్కొంటున్న సవాళ్లు, వాటిని అధిగమించే మార్గాలు, బ్యాంకుల ద్వారా రుణాలు పొందే విధానం, పొందిన రుణాలను సద్వినియోగం చేసుకుంటూ విజయవంతమైన పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి అవసరమైన మెలకువలు వివరించబడ్డాయి. బిట్స్ పిలానీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ ఫైనాన్స్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా రాధిక గుప్తా మాట్లాడుతూ జిల్లాలోని మహిళలందరూ మంచి పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని, వారు నిర్వహించే వ్యాపారానికి ఒక ప్రత్యేక బ్రాండింగ్ ఉండాలని అన్నారు. ఆ ఉత్పత్తులు మంచి నాణ్యతతో ఉండాలని సూచించారు. వ్యాపార అభివృద్ధి ద్వారా సమాజానికి కూడా మేలు చేయాలని ఆమె సూచించారు.

ఈ కార్యక్రమంలో నేర్చుకున్న విషయాలను జిల్లాలోని ఇతర మహిళలతో పంచుకొని వారికి కూడా మెలకువలు తెలియజేయాలని ఆమెకోరారు. ఈ కార్యక్రమంలో డిఆర్ డిఓసాంబశివరావు, బిట్స్ డీన్ యోగేశ్వరి, డైరెక్టర్ సౌమ్య ముఖర్జీ, హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ ఋషి కుమార్, ప్రొఫెసర్ సెంటర్ హెడ్ స్వాతి అలోక్, రిసోర్స్ పర్సన్ శ్రీ మహేష్ విశ్వనాథ్ (జనరల్ మేనేజర్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, లెర్నింగ్ అండ్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్), ఎస్ బిఐ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్,డాక్టర్ వసుమతి (అసిస్టెంట్ ప్రొఫెసర్), ఎస్ బిఐ సుబ్రహ్మణ్యం, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్స్ పూర్వ ఆర్ బిఐ ఆంధ్ర బ్యాంక్ నుండి నిపుణులు శిక్షణ అందించారు.



# రే ఆఫ్ సన్ షైన్ ఫౌండేషన్ ప్రారంభం ఆశ,స్ఫూర్తి, సేవల కొత్త వెలుగు

RAY OF SUNSHINE FOUNDATION

**హైదరాబాద్, నవంబర్ 03, (తెలంగాణ దిశ) :**మానవత్వం, సహాయం, ఆశఅనే విలువలను ముందుకు తీసుకెళ్లే నూతన సామాజిక సేవా సంస్థ "రేఅఫ్‌సన్‌షైన్ ఫౌండేషన్ (ఆర్ఓఎస్ఎఫ్) హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ఈ ఎన్జీఓను అక్టోబర్ 2025లో శ్రీకాంత్ తాడూరి, జోహన్నా శామ్యూల్ హాల్ సంయుక్తంగా స్థాపించారు. ఈ సందర్భంగా కాప్రా సైనిక్ పురిలోని కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. సమాజంలో సానుకూల మార్పు తీసుకురావడం లక్ష్యంగా ఈ ఫౌండేషన్ మూడు ప్రధాన విభాగాలపై దృష్టి సారించిందన్నారు. క్యాన్సర్‌తో పోరాడుతున్న రోగులకు ఆర్థిక సహాయం, ప్రోత్సాహం, ఆశ నింపడం ఈ విభాగం ప్రధాన ఉద్దేశ్యమన్నారు. సూర్యకాంతి లా జీవితం వెలిగించాలనే లక్ష్యంతో ఈ ఫౌండేషన్ రోగుల జీవితాల్లో కొత్త వెలుగు నింపుతుందన్నారు. అదే విధంగా కార్డియోపల్మోనరీ రిససిటేషన్ (సీపీఆర్) ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి 'రే ఆఫ్ సన్‌షైన్ ఫౌండేషన్' దేశవ్యాప్తంగా





శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తుందని వారు తెలిపారు. పిల్లలు, పెద్దల కోసం ప్రత్యేక సీపీఆర్ తరగతులు, ప్రాక్టికల్ డెమోలు నిర్వహించడం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాల ను రక్షించే నైపుణ్యాలను ప్రజలకు నేర్పించడమే లక్ష్యంగా పనిచేస్తామని అన్నారు. అంతే కాకుండా ప్రతిభ ఉన్న ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటు న్న క్రీడాకారులకు రేస్ ఫీజులు, జెర్సీలు, షూస్ వంటి అవసరమైన సామగ్రి అందించడం ద్వారా ఫౌండేషన్ వారి కలలను నెరవేర్చడంలో భాగస్వామ్యం అవుతు ందని వారు తెలిపారు. తమ స్వచ్ఛంద సంస్థ ఈ సంవత్సరం చేపట్టబోయే సామాజిక కార్యక్రమాలను తెలియజేశారు. గత ఐదు సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం నవంబర్ లో నిర్వహించే "మోవెంబర్లా అల్ట్రా" పురుషుల ఆరోగ్యంపై అవగాహన కల్పించడానికి నిర్వహించే ఫండ్ రైజింగ్ అల్ట్రా రన్ ను నిర్వహించి రూ. 5 లక్షలు సేకరించి ప్రోస్టేట్ క్యాన్సర్ రోగులకు సహాయం చేయాలని సంకల్పించామన్నారు. వచ్చే డిసెంబర్ ఏడవ తేదీన యువత, తల్లిదండ్రులకు ప్రాథమిక ఫస్ట్ ఎయిడ్, సీపీఆర్ శిక్షణ కార్యక్ర మాలు చేపట్టను న్నామన్నారు. క్రీడాకారుల అభివృద్ధి, సీపీఆర్శిక్షణా కార్యక్రమాలకు నిధులను సేకరించి అర్హులైన లబ్ధిదారులకు అంద జేస్తామన్నారు. సామాజిక సేవ, అవగాహన, ప్రోత్సాహం అనే మూడు స్తంభాలపై నిలిచిన రే ఆఫ్ సన్‌షైన్ ఫౌండేషన్, హైదరాబాద్‌తో పాటు దేశవ్యాప్తంగా ఆశాకిరణంగా నిలుస్తుందని నిర్వాహకులు తెలిపారు. మరిన్ని వివరాలకు శ్రీకాంత్ తాడూరి 9949113931, 70755 91085, ఈమెయిల్ ఐడి **(rosf.jost@gmail.com)**,ఇక్ష్లలో సంప్ర దించవచ్చు. ఇన్ స్టాగ్రామ్ ఐడి **(rayofsunshine.foundation)** లో అనుసరిం చవచ్చు.

## విద్యార్థుల పోటీ పరీక్షలపై ప్రధానోపాధ్యాయ సంఘం ప్రతినిధులతో

# టి-సాట్ సీఈఓ సమీక్ష..





**శేరిలింగంపల్లి,నవంబర్ 04, (తెలంగాణ దిశ) :**తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఆరు నుండి పదవ తరగతి లోపు విద్యార్థులకు టి-సాట్ (తెలంగాణ స్కిల్ అకడమిక్ అండ్ ట్రైనింగ్) మరియు టిఎస్ జిహెచ్ఎంఎ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీ పరీక్షలపై టి-సాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. జూబ్లీహిల్స్ టి-సాట్ కార్యాలయంలో టీఎస్ జిహెచ్ఎంఎ(తెలంగాణ రాష్ట్ర గజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం) ప్రధాన కార్యదర్శి ఎస్. గిరిధర్ ఇతర సభ్యులతో కలిసి సీఈవో సమీక్ష నిర్వహించారు. గత రెండు, మూడు రోజులుగా రాష్ట్రంలోని వివిధ పాఠశాలల్లో క్విజ్, వ్యాసరచన, ఉపన్యాస పోటీల నిర్వహణపై సీఈవో వేణుగోపాల్ రెడ్డి సంఘం ప్రధాన కార్యదర్శి గిరిధర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల్లో సృజనాత్మక తనువెలికి తీసేందుకు ఇటువంటి పోటీలుప్రతియేటా నిర్వహిస్తే బాగుంటుందని గుర్తు చేశారు. విద్యార్థులు గ్రామాల నుండి మండల స్థాయి పోటీలకు, మండలాల నుండి జిల్లా స్థాయి పోటీలకు, జిల్లాల నుండి నవంబర్ 12,13తేదీలలో రాష్ట్ర స్థాయి పోటీలుజరిగే టి-సాట్ కార్యాలయానికి వచ్చే విద్యార్థుల పట్ల ఉపాధ్యాయుల తగిన జాగ్రత్తలు తీసుకునే విధంగా హెడ్మాస్టర్లు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. పోటీల్లో ఎక్కువ మంది విద్యార్థులు పాల్గొనే విధంగా ప్రోత్సహించడం వల్ల వారిలో పోటీ తత్వం పెరిగి బంగారు భవిష్యత్ కు వారే బాటలు వేసుకుం టారని వేణుగోపాల్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

# నిరు పేదలకు ఇంటి కళ నెరవేస్తున్న కాంగ్రెస్ పార్టీ



**దమ్మాయిగూడ, నవంబర్ 04, (తెలంగాణ దిశ) :**కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పేదలకు ఇళ్లు మంజూరు చేసిందని కాంగ్రెస్ పార్టీ దమ్మాయిగూడ మున్సిపల్ అధ్యక్షులు ముప్పా రామారావు అన్నారు. మంగళవారం దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని బండ్లగూడకు చెందిన లబ్దిదారులు కవితా మహేందర్ నూతన ఇందిరమ్మ గృహ ప్రవేశ కార్యక్రమంలో కమిషనర్ వెంకటరెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఇంటి యజమాని కవితా మహేందర్ తో కలిసి గృహప్రవేశం ప్రారంభం అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలలో భాగంగా ఆరు గ్యారెంటీలలో ఒకటైన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో సొంత స్థలం ఉన్న వారి ఇంటి నిర్మాణానికి రూ. ఐదు లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నిరుపేదల కళ నెర వేర్చే విధంగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు పరచడం అభినందనీయమన్నారు.

ఈ పథకం ద్వారా లబ్ధిదారులకు తమ సొంత ఇంటి కల నెర వేర్చుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ శ్రీహరి, మున్సిపల్ అధికారులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, స్థానిక కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.







**జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని షేక్ పేట్ లో బుధవారం నిర్వహించి తలపెట్టిన సీఎం రేవంత్ రెడ్డి రోడ్డు షో కు సంబంధించిన ఏర్పాట్లను మంత్రి వివేక్ వెంకటస్వామితో కలసి మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ సభాస్థలిని పర్యవేక్షించారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రోడ్ షో ను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఇంచార్జీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.**

**- (కుత్బుల్లాపూర్, తెలంగాణ దిశ)**

# గాజాలో మారణాయుధాలుగా మారిన బిగ్ టెక్ కంపెనీలు








నిప్పుకు గాలి తోడైనట్టుగా, గాజాలో ఇజ్రాయిల్ జరిపిన నరమేధానికి, విధ్వంసానికి అమెరికా బడా టెక్ కంపెనీలు తోడయ్యాయి. ఇజ్రాయిల్ యుద్ధ యంత్రాంగంతో ఈ టెక్ కంపెనీల బంధం ఎంత లోతుగా, దృఢంగా పెనవేసుకుని ఉన్నదో ఇటీవల బయటికొచ్చిన పరిశోధనలు తెలియజేస్తున్నాయి. ప్రపంచం ముందు నూతన ఆవిష్కరణలు, అభివృద్ధి అంటూ ప్రగతికాముక సంస్థలుగా నటించే ఈ కంపెనీల 'అసలు రంగు' ది గార్డియన్, ం972 పత్రిక, లోకల్ కాల్ సంయుక్తంగా నిర్వహించిన పరిశోధనలో వెల్లడైంది. ఇజ్రాయిల్ మిలటరీ గూఢచారి విభాగం పేరు 8200. అది పాలస్తీనాలోని ప్రతి ఒక్క పౌరుడి ఫోను సంభాషణను, రికార్డు చేసి, భద్రపరిచి, విశ్లేషించడానికి మైక్రోసాఫ్ట్‌కి చెందిన క్లౌడ్ ప్లాట్‌ఫారం అజూర్‌ను వాడుకున్నది. 8200, మైక్రోసాఫ్ట్‌తో చేసుకున్న భాగస్వామ్య ఒప్పందం వల్ల ఇజ్రాయిల్‌కు అపరిమితమైన నిఘా సామర్థ్యం లభించింది. పాలస్తీనా ఆక్రమణలో అజుర్ క్లౌడ్ ప్లాట్‌ఫామ్ ఉపయోగపడింది. అది అందించిన లక్షలాదిమంది పాలస్తీనియన్ల వ్యక్తిగత ఫోను సంభాషణలు ఇజ్రాయిల్‌కు ముడి సరుకుగా ఉపయోగపడ్డాయి. నిజానికి, మైక్రోసాఫ్ట్ భాగస్వామ్యమే లేనట్టయితే ఇజ్రాయిల్ కంప్యూటర్ సర్వర్లకు భారీ డేటాను భద్రపరిచి విశ్లేషించే శక్తి సామర్థ్యాలు లేవు. ఈ విషయం ఇజ్రాయిల్‌కు తెలుసు. అందువలనే ఇజ్రాయిల్ మైక్రోసాఫ్ట్‌ను ఆశ్రయించింది. క్లౌడ్ ప్లాట్‌ఫామ్ వలన డేటా నిల్వ సామర్థ్యం "అనంతం"గా పెరిగింది. 1921లో మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్లను, ఇజ్రాయిల్ గూఢచారి విభాగం 8200 కామాండర్ యెస్సి సరీల్ కలవటంతో ఈ ప్రాజెక్టు మొదలైంది. అయితే, ఇజ్రాయిల్ సైన్యంతో మైక్రోసాఫ్ట్ కుమ్మక్కవడం ఇది మొదటిసారి కాదు. 2025 జనవరిలో ం972 మ్యాగజైన్ చేసిన పరిశోధనలో మైక్రోసాఫ్ట్ ఇజ్రాయిల్ సైన్యం మధ్య లోతైన సంబంధాలు ఉన్నాయని తెలిసింది. ఇజ్రాయిల్ సైనిక కార్యకలాపాలకు నేరుగా మద్దతు ఇచ్చే ప్రాజెక్టులలో అజుర్, ఓపెన్ ఏఐ (కృత్రిమ మేధ)ల సహకారం ఉంది. ఇతర బిగ్ టెక్ మాదిరిగానే మైక్రోసాఫ్ట్ కూడా ఇజ్రాయిల్ ఆక్రమణ, అణచివేత సామూహిక హత్యలకు సాధనంగా మారింది. అజుర్‌పై ఇజ్రాయిల్ సైనిక గూఢచారి విభాగమే కాక, మిగతా అన్ని ఆర్మీ యూనిట్లు కూడా ఆధారపడ్డాయి. ఇలా ఇజ్రాయిల్ గాజా మారణహోమంలో తోడైంది మైక్రోసాఫ్ట్ ఒక్కటి మాత్రమే కాదు. గూగుల్, అమెజాన్, పలాంటిర్ వంటి పెద్ద టెక్ కంపెనీలు ఈ మారణహోమంలో భాగస్వాములై డబ్బులు పోగేసుకున్నాయి. ప్రపంచం ముందు నూతన ఆవిష్కరణలు చేసి అభివృద్ధికి బాటలు వేసే కంపెనీలుగా గొప్పలు పోయే ఈ టెక్ కంపెనీలు వాస్తవంలో ఇజ్రాయిల్ యుద్ధ యంత్రాంగంలో అంతర్భాగం అయ్యాయి. ఈ టెక్ కంపెనీలు అమెరికా సైనిక-పారిశ్రామిక కూటమికి బయటకు ఆగుపడని వెన్నెముకలాగా పనిచేస్తున్నాయి. దీనికి తక్షణ ఉదాహరణగా, ప్రపంచం నడిబొడ్డున గాజాలో జరిపిన సామూహిక హత్యాకాండ మన కళ్ల ముందున్నది. ఇజ్రాయిల్‌తో అజుర్ కలవటంతో, మైక్రోసాఫ్ట్ వ్యాపారం వరకే పరిమితమైన తటస్థ సంస్థగా లేదు. అంతకు మించి ఇజ్రాయిల్ సంస్థలతో కలిసి టెక్నాలజీని అభివృద్ధి చేసి, స్థానిక నిఘా కంపెనీల్లో పెట్టుబడులు పెట్టి ఆ దేశంలో పరిశోధనా ప్రయోగ శాలలు నడుపుతున్నది. చివరికి పాలస్తీనాపై నియంత్రణలో ఇజ్రాయిల్ మైక్రోసాఫ్ట్ కంపెనీని వదులుకోలేని పరిస్థితి ఏర్పడింది.

గూగుల్, అమెజాన్, నింబస్ ప్రాజెక్టు: ఈ వ్యవహారంలో మరో రెండు కంపెనీలు గూగుల్, అమెజాన్‌లు మైక్రోసాఫ్ట్ కంటే ఏ మాత్రం వెనకబడి లేవు. ఈ కంపెనీలు ఇజ్రాయిల్ ప్రభుత్వంతో 120 కోట్ల డాలర్లతో ప్రాజెక్టు నింబస్ కోసం ఒప్పందం కుదుర్చుకున్నాయి. ప్రాజెక్టు నింబస్ అంటే మరింత అభివృద్ధి పరచిన క్లౌడ్ సదుపాయాలు, కృత్రిమ మేధ పరికరాలు అందుబాటులోకి తెచ్చే ప్రాజెక్టు. యంత్రాల ద్వారా ముఖాన్ని చూసి మనుషులను గుర్తించటం, భావోద్వేగాలను విశ్లేషించడం, శాంతి భద్రతల సమస్య ఎక్కడ తలెత్తుతుందో ముందుగానే గుర్తించడం ఈ ప్రాజెక్ట్ నింబస్‌లో భాగం. ఇవి పాలస్తీనా ప్రజలపై నిరంతరం నిఘా పెట్టగలిగిన సాంకేతిక సాధనాలు. 'తూర్పు జెరూసలెంలో అనుమానితులు' గురించిన డేటాను తయారు చేసి, వారిలో ఎవరిని చంపాలో జాబితా తయారు చేసివ్వటం నింబస్ ప్రాజెక్టులో భాగం.

పలంటీర్: డేటా ఆయుధ వ్యాపారి: గాజా మారణహోమంలో పాల్గొన్న మరో అమెరికా సంస్థ పలంటీర్. అమెరికా ప్రభుత్వపు అధికార గూఢచారి సంస్థ సిఐఏ పెట్టుబడితో, సహకారంతో ప్రారంభించబడిన పలంటీర్, ప్రస్తుతం అతి పెద్ద నిఘా సంస్థగా, మిలిటరీ గూఢచారి సంస్థగా పేరు తెచ్చుకున్నది. మైక్రో సాఫ్ట్, గూగుల్, అమెజాన్‌లు మౌలిక సదుపాయాలు అందిస్తే, పలంటీర్ విశ్లేషణాత్మక సాధనంగా పనిచేస్తున్నది. పాశ్చాత్య దేశాల గెలుపుకు తానే కారణమని గొప్పగా చెప్పుకుంటుంది పలంటీర్. ఇది ఇజ్రాయిల్ సైన్యానికి అందించే సేవలను విస్తృతంగా పెంచింది. ఇటువంటి వ్యవస్థలే పాలస్తీనా పౌరుల చావులను వేగవంతం చేశాయి. పలంటీర్ యుద్ధాలను ఆసరా చేసుకుని పెరిగి పెద్దదైంది.

ప్రాణాలు తీసేందుకు 'లావెండర్' జాబితా: 'లావెండర్' పేరుతో ఇజ్రాయిల్ కృత్రిమ మేధస్సుపై ఆధారపడిన ప్రోగ్రామ్‌ను తయారు చేసింది. గాజాలో తొలి నాళ్లలో పాలస్తీనియన్లపై బాంబుల వర్షం కురిపించడంలో, హత్యలకు లక్ష్యాలను నిర్ణయించడంలోనూ లావెండర్ కృత్రిమ మేధను బాగా ఉపయోగించుకున్నారు. కృత్రిమ మేధ లావెండర్ చేసే నిర్ణయాలు పూర్తిగా మనుషులు చేసిన నిర్ణయాలు లాగానే ఉండేవి. ఇది వందల వేలమంది పాలస్తీనియన్లను అనుమానాస్పద మిలిటెంట్లుగా పేర్కొని వారిని చంపేందుకు ఆటోమేటిక్‌గా జాబితాను తయారు చేస్తుంది. తర్వాత ఈ నిర్ణయాలు అమలై వేలాది మంది పౌరులు బలయ్యారు.

చాట్ జిపిటి వంటి జనరేటివ్ ప్లాట్‌ఫామ్‌లను ఆదర్శంగా తీసుకుని, ఇజ్రాయిల్ ఇంటెలిజెన్స్ కొత్త ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ టూల్స్ తయారు చేస్తోంది. వీటి పని నిఘా నిర్వహించటం, ఆరోపణలు సంధించటం, అరెస్టులను వేగవంతం చేయడం. ఇది గాజాలో జరుగుతున్న హత్యాకాండకు మాత్రమే పరిమితం కాదు. భవిష్యత్తులో జరిగే యుద్ధాలకు, సామూహిక హత్యాకాండకు ఒక 'మెథడ్'గా మారబోతున్నది. ఈ టెక్నాలజీలను అమెరికా పెద్ద టెక్ కంపెనీలు కలిసి అభివృద్ధి చేస్తున్నాయి.


సామ్రాజ్యవాద ప్రయోగశాలగా ఇజ్రాయిల్: ఈ విషయాలన్నింటి కలిపి చూస్తే, అమెరికా సామ్రాజ్యవాదానికి ఇజ్రాయిల్ ఒక ప్రయోగశాలగా మారిందనిపిస్తుంది. పాలస్తీనియన్లపై ప్రయోగించిన ప్రతి ఆక్రమణ పద్ధతి తరువాత ప్రపంచానికి ఎగుమతి అవుతోంది. ఉదాహరణకు, వెస్ట్ బ్యాంక్‌లో మొదట ఉపయోగించిన "ప్రిడిక్టివ్ పోలీసింగ్" (అంటే ముందుగానే నేరాలను అంచనా వేసే సాఫ్ట్‌వేర్)ను ఇప్పుడు అమెరికా పోలీసు శాఖలకు అమ్ముతున్నారు. ఈస్ట్ జెరూసలెంలో మొదట ఉపయోగించిన బయోమెట్రిక్ చెక్ పాయింట్లు ఇప్పుడు అమెరికా-మెక్సికో సరిహద్దులో కనిపిస్తున్నాయి. గాజాలో పరీక్షించిన కృత్రిమ మేధ ఆధారిత నిఘా వ్యవస్థలు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా నియంత ప్రభుత్వాలకు అమ్ముతున్నారు. బిగ్ టెక్ కంపెనీలకు (మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్, పలాంటిర్) ఇజ్రాయిల్ ఒకవైపు పెద్ద కస్టమర్, మరోవైపు ఆ కంపెనీలు తమ టెక్నాలజీలను పరీక్షించుకునే లేబరేటరీ. ఈ కంపెనీలు ఇజ్రాయిల్ సైనిక వ్యవస్థలో భాగమై, అణచివేత టెక్నాలజీలను కలిసి అభివృద్ధి చేస్తాయి. తరువాత అవి ప్రపంచమంతా అమ్ముకునే ఉత్పత్తులవుతాయి.ఆ కారణంగా గాజాలో జరుగుతున్న విధ్వంసం కేవలం రాజకీయ ప్రాజెక్టు మాత్రమే కాదు. గూఢచర్యం, యుద్ధం, సామూహిక హత్యలను వ్యాపారంగా మార్చే నమూనాగానూ మారింది.

ఐక్యరాజ్యసమితి హెచ్చరిక: పాలస్తీనా విషయాలపై ఐక్యరాజ్యసమితి ప్రత్యేక ప్రతినిధి ఫ్రాన్సిస్కా అల్బానీస్ ఇప్పటికే హెచ్చరిక ఇచ్చారు. ఆమె మానవ హక్కుల మండలికి సమర్పించిన నివేదికలో, గాజాపై ఇజ్రాయిల్ చేసిన 21 నెలల దాడిలో అమెరికా బిగ్ టెక్ కంపెనీల పాత్రను వివరించారు. ఈ కంపెనీలు యుద్ధనేరాలకు అవసరమైన సాంకేతిక మౌలిక వసతులు, సేవలందించి, ఆ దాడులను సులభతరం చేశాయని ఆమె తెలిపారు. ఆమె నివేదిక ఒక స్పష్టమైన నిజాన్ని చెబుతుంది: బిగ్ టెక్ పక్కన నిలబడి చూసే సంస్థ కాదు, అది గాజా హత్యాకాండలో సామ్రాజ్యవాద యుద్ధ యంత్రంలో ఒక భాగంగా చురుకుగా పాల్గొంటున్న భాగస్వామి.

బిగ్ టెక్, అమెరికా యుద్ధ పరిశ్రమలది వీడని బంధం: అమెరికా రక్షణ శాఖ (పెంటగన్)కు, గూఢచారి సంస్థ (ఎన్ఎస్ఏ)కు ప్రపంచంలోని అతి పెద్ద టెక్ కంపెనీలు బాగా విశ్వసించదగిన కాంట్రాక్టర్లుగా పనిచేస్తున్నాయి. ఇదేమీ ఆశ్చర్యం కలిగించే విషయం కాదు. అమెజాన్ వెబ్ సర్వీసు సీఐఏ డేటాను భద్రపరుస్తుంది. మైక్రోసాఫ్ట్ అజుర్ అమెరికా రక్షణ వ్యవస్థలకు సాంకేతిక మద్దతు కల్పిస్తుంది. గూగుల్ సైనిక కృత్రిమ మేధ ప్రాజెక్టులపై కలిసి పనిచేస్తుంది. పలంటీర్ గూఢచారి సంస్థల కోసం రూపొందించిన సాధనం. ఈ విధంగా, బిగ్ టెక్, సైనిక, పరిశ్రమల, గూఢచారి వ్యవస్థల కలయిక పూర్తయింది. ఈ ప్రాజెక్టు ఇజ్రాయిల్‌లో మాత్రమేగాక ప్రపంచవ్యాప్తంగా ఉంది. పర్యవేక్షణ, లక్ష్యాల నిర్దేశన, ప్రజలపై నిఘా ద్వారా ఈ కంపెనీలు లాభాలు పొందుతున్నాయి.

ప్రతిఘటన-భవిష్యత్ మార్గం: అయితే ప్రతిఘటన ఆగలేదు. కొనసాగుతోంది. గూగుల్, అమెజాన్ లోని కొంతమంది ఉద్యోగులు ఈ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా గొంతెత్తుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా విద్యార్థులు, విశ్వవిద్యాలయాలు యుద్ధ లబ్ధిదారులతో సంబంధాలు తెంచుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. మానవ హక్కుల సంస్థలు ఈ కార్పొరేట్ నేరాలను ప్రపంచం ముందు పెడుతున్నాయి. పాలస్తీనాలో ప్రజలు చూపిస్తున్న అచంచల పోరాట పటిమ, ఏ యంత్ర మేధస్సు తొలగించలేని ఆత్మస్థైర్యానికి నిదర్శనం. అయితే ఈ ప్రతిఘటన ఇంకా విస్తృతం కావాలి. ఈ డిజిటల్ యుద్ధ వ్యాపారులను ఎదుర్కోవాలి.

# సంక్రాంతి నాటికి డీఎస్సీ!




**విజయవాడ,తెలంగాణ దిశ :**ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న వారికి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మరో గుడ్ న్యూస్ చెప్పారు. పాఠశాల విద్య, ఇంటర్మీడియట్, కళాశాల విద్య ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన ఆయన డీఎస్సీ జనవరిలో నిర్వహించబోతున్నట్టు వెల్లడించారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రతి ఏటా డీఎస్సీ, టెట్ ఉంటాయని పునరుద్ఘాటించారు. ప్రతిఏటా డిఎస్సీ ద్వారా టీచర్ పోస్టుల భర్తీకి ఇచ్చిన హామీకి కట్టుబడి ఉన్నామని మంత్రి నారా లోకేష్ మరోసారి ప్రకటించారు. ఈ ఏడాది నవంబర్ చివరి వారంలో టెట్, 2026 జనవరిలో డీఎస్సీ నోటిఫికేషన్, మార్చిలో డిఎస్సీ నిర్వహించి, టీచర్ పోస్టులను భర్తీకి ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. టెట్, డిఎస్సీలకు అభ్యర్థులంతా సన్నద్ధం కావాలి సూచించారు. కొత్త డిఎస్సీ నిర్వహణ తర్వాత వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి కొత్త ఉపాధ్యాయులు విధుల్లో చేరేలా ప్రణాళిక అమలు చేస్తామన్నారు లోకేష్. 2026 జనవరిలో నోటిఫికేషన్, మార్చిలో డిఎస్సీ, స్పెషల్ డిఎస్సీ నిర్వహిస్తామన్నారు. విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలపై లక్ష్యసాధనకు యాక్షన్ ప్లాన్ రూపొందించాలని అన్నారు. బేస్ లైన్ టెస్ట్ నిర్వహణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 78మంది ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను మెరుగైన విద్యాప్రమాణాలపై అధ్యయనానికి సింగపూర్ పర్యటనకు పంపించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశించారు. మెగా డీఎస్సీ పేరుతో ఇప్పటికే ఈ ఏడాది ఒక నోటిఫికేషన్ విడుదల చేసింది. కొత్త రిజర్వేషన్లు అమలులోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది. ఏప్రిల్ 20న 16వేలకుపైగా పోస్టులతో తొలి నోటిఫికేషన్ ఇచ్చింది. చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన తొలి రోజే డీఎస్సీ నియామక నోటిఫికేషన్ విడుదలకు సంబంధించి సంతకం చేశారు. కానీ రిజర్వేషన్ల అంశం ఇతర న్యాయ సమస్యలను పరిష్కరించుకొని ఏప్రిల్‌లో నోటిఫికేషన్ వచ్చింది. ఏప్రిల్‌లో వచ్చిన నోటిఫికేషన్‌కు జూన్‌లో పరీక్షలు పెట్టారు. నెల రోజుల పాటు పరీక్షలు నిర్వహించారు. అక్కడికి నెల రోజుల తర్వాత ఫలితాలు విడుదల చేసి నియామక ప్రక్రియను కూడా పూర్తి చేశారు. అమరావతిలో వేడుకగా కొత్త ఉపాధ్యాయులకు నియామక పత్రాలను కూడా అందజే?శారు. ఆ టైంలోనే ఏటా డీఎస్సీ ఉంటుందని నవంబర్‌లో టెట్ నోటిఫికేషన్ వేస్తున్నామని మంత్రి నారా లోకేష్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. అన్నట్టుగానే అందుకు తగ్గ కార్యచరణ చేపట్టాలని అధికారులకు మంత్రి నారా లోకేష్ ఆదేశాలు జారీ చేశారు. మొన్న నోటిఫికేషన్‌లో మిగిలిన పోస్టులు, ఇంకా వివిధ పాఠాశాలల్లో ఉన్న ఖాళీల గుర్తించాల్సి ఉంది. ఈసారి భారీ స్థాయిలో పోస్టులు ఉండకపోవచ్చని అధికారులు చెబుతున్నారు. భారీగా పోలీసుల నియామాకాలు: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిరుద్యోగులకు త్వరలోనే గుడ్‌న్యూస్ అందించే అవకాశం ఉంది. ఈ మేరకు రాష్ట్రంలో పోలీసు డిపార్ట్‌మెంట్‌లో ఉన్న ఖాళీలను భర్తి చేసేందుకు ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ విభాగాల్లో ఉన్న ఖాళీలను భర్తీ చేసేందుకు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. సివిల్, ఆర్మ్‌డ్ రిజర్వు, స్పెషల్ ఆర్మ్‌డ్ రిజర్వు, ఏపీఎస్‌సీ, సీపీఎల్, పీటీఓ, కమ్యూనికేషన్స్‌లో.. ఉన్న ఖాళీలను భర్తీ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే పోలీసు విభాగంలో ఖాళీల వివరాలకు సంబంధించిన లేఖను ఇప్పటికే డీజీపీ.. ప్రభుత్వానికి పంపించారు. ఆ వివరాలు పరిశీలించిన తర్వాత ప్రభుత్వం అనుమతి ఇస్తే.. పోలీసు ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది.రాష్ట్ర ప్రభుత్వానికి డీజీపీ కార్యాలయం పంపించిన లేఖలో ఖాళీల వివరాలను ప్రస్తావించింది. ఈ ఏడాది? ఆగస్టు 31వ తేదీ వరకు ఉన్న ఖాళీలని అందులో వెల్లడించారు. దాని ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ పోలీసు విభాగంలో.. సివిల్ పోలీస్ ఫోర్స్‌లో 315 ఎస్సైలు,3580 సివిల్ కానిస్టేబుల్, 96 ఆర్ఎస్ఐ, 2520 ఏపీఎస్పీ కానిస్టేబుళ్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపింది. ఈ పోస్టుల నియామకాలకు అనుమతించాలని విజ్ఞప్తి చేసింది. అయితే ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇస్తే.. రాష్ట్రంలో పోలీస్ ఉద్యోగాల రిక్రూట్‌మెంట్‌కు నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది.

ఆంధ్రప్రదేశ్‌లో రోజురోజుకూ నేరాలు పెరుగుతున్నాయని ప్రభుత్వానికి రాసిన లేఖలో డీజీపీ పేర్కొ?న్నారు. నేరగాళ్లు కొత్త పద్ధతుల్లో నేరాలు పాల్పడుతున్నారని చెప్పారు. రాష్ట్రంలో శాంతి భద్రతలను పటిష్టం చేయాలంటే.. పోలీస్ ఫోర్స్ అవసరమని అన్నారు. అందు కోసం ఖాళీలను సాధ్యమైనంత త్వరగా భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ ఇచ్చేందుకు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తాజాగా నిరుద్యోగుల గరిష్ఠ వయోపరిమితి పెంచింది. న్-యూనిఫాం సర్వీస్‌ల్లో పోస్టులకు.. గరిష్ఠ వయోపరిమి తిని 34 నుంచి 42 ఏళ్లకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. దీని ప్రకారం.. ఇప్పుడు 42 ఏళ్ల వరకు కూడా ఈ ఉద్యోగాలకు అప్లై చేసుకోవచ్చు.యూనిఫాం పోస్టులకు రెండేళ్లు వయోపరిమితి పెంచింది. ఈ సడలింపు వచ్చే ఏడాది సెప్టెంబర్ 30 వరకు వర్తించనున్నట్లు తెలిపింది. ఏపీపీఎస్సీ, ఇతర నియామక సంస్థల ద్వారా జరిగే నియామకాలకు ఇది వర్తిస్తుందని సర్కార్ పేర్కొంది. అయితే ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో చాలా మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు మెరుగుపడనున్నాయి. అందులో ముఖ్యంగా, వయసు కారణంగా ఉగ్యోగాలు అనర్హులుగా ఉన్నవారు.. ఈ వయోపరిమితి పెంపుతో మళ్లీ దరఖాస్తు చేసుకో వచ్చు. అలాంటి వారికి ఇది ఒక గొప్ప అవకాశం అని చెప్పాలి.



## రాయలసీమలో బంగారం తవ్వకాలు..

**కర్నూలు,తెలంగాణ దిశ:** రాయి రాయి అన్నది ఒకనాటికి రత్నమవునురా. బంగారం లాంటి ఈ మాట ఇప్పుడు రాయలసీమలో బంగారం ఉత్పత్తికి బాటలేసింది. ఇన్నాళ్లు నెర్రలు బాసిన నేలలో ఇప్పుడు ఇక కనకధారే. అవును..కరువుకు కేరాఫ్‌గా నిలిచిన కర్నూలు సీమ ఇప్పుడు ఆత్మనిర్భర్ భారత్‌కు సిరుల సిగ కాబోతోంది. కర్నాటక గోల్డ్ ఫీల్డ్‌ను మించి తుగ్గలి మండలంలో జొన్నగిరి గోల్డ్ ప్రాజెక్ట్‌లో భారీ మైనింగ్‌కు రంగం సిద్ధమైంది. దేశంలోనే మొట్ట మొదటి అతిపెద్ద ప్రవేటు గోల్డ్ మైన్‌గా కర్నూలు రికార్డు క్రియేట్ చేయబోతుంది. తుగ్గలి మండలం బొల్లవానిపల్లి గ్రామంలో గోల్డ్ మైనింగ్ ప్రారంభిస్తున్నట్టు జియో మైసూర్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రకటించింది. పసిడి ధరలు రికార్డు స్థాయిలో ఆకాశన్నంటుతున్న వేళ డెఫినెట్‌గా ఇది బంగారం లాంటి మాటే. స్వాతంత్ర్యం వచ్చాక ఇప్పటి వరకు దేశంలో అతిపెద్ద ఫస్ట్ ప్రయివేటు గోల్డ్ మైన్ ఇదే.వానొస్తే కర్నూలు జిల్లా తుగ్గలి, పగిడిరాయి, తుగ్గలి, జొన్నగిరి సహా చుట్టుపక్కల గ్రామాల్లో వజ్రాలవేట జోరుగా సాగేది. అంతేకాదు నెర్రలు బాసిన ఈ నేలలో బంగారు నిక్షేపాలున్నాయని పరిశోధనల్లో తేలింది. అలా తుగ్గలి మండలం బొల్లవానిపల్లి గ్రామం దగ్గర జియో మైసూర్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో జొన్నగిరి గోల్డ్ ప్రాజెక్టును ఏర్పాటు చేశారు. బంగారం, వెండి వంటి ఖనిజాల వెలికితీతలో ఎంతో అనుభవం వున్న త్రివేణి త్రివేణి ఎర్త్ మూవర్స్, లాయ్‌లాడ్స్ మెటల్ అండ్ ఎనర్జీ లిమిటెడ్, దక్కన్ గోల్డ్ మైన్స్ భాగస్వామ్యంతో జొన్నగిరి గోల్డ్ ప్రాజెక్ట్ రాయలసీమలో సువర్ణ శకానికి తెరలేచింది.జియో మైసూర్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ 70 శాతంతో ప్రధాన వాటాదారులైన త్రివేణి సంస్థ ఎండీ ప్రభాకరన్ జొన్నగిరి గోల్డ్ ప్రాజెక్ట్ త్వరలో మైనింగ్ చేపడుతామని ప్రకటించారు. ఏడాదికి 500 కేజీల ఉత్పత్తి లక్ష్యంగా త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. ఏటా టన్ను బంగారం ఉత్పత్తి చేసేలా ప్రణాళికలు సిద్దంచేసినట్టు చెప్పారాయన. భవిష్యత్తులో ఇక్కడ బంగారం ఉత్పత్తి మరింత పెరిగే అవకాశం ఉందన్నారు.ప్రస్తుత కొత్తగా నిర్మించిన ప్లాంట్‌లో ట్రయల్ రన్ కొనసాగు తుందన్నారు. భారత్ ఆత్మనిర్భర్ సంకల్పానికి జొన్నగిరి గోల్డ్ ప్రాజెక్ట్ బాసటగా నిలుస్తుందన్నారు. బంగారం ఉత్పత్తితో పాటు సామాజిక బాధ్యతగా పరిసర గ్రామాల అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి తామ ప్రాజెక్ట్ చేయూతనిస్తుందన్నారు ప్రభాకరన్. భూములిచ్చిన రైతు కుటుం బాలకు,స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు.

# అమెరికా మిలిటరీ టెక్నాలజీకే ఎసరు

న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపట్టాక.. ఆయన తీసుకుంటున్న నిర్ణయాలతో ప్రపంచ దేశాలన్నీ అమెరికాకే వ్యతిరేకంగా మారుతున్నాయి. మరోవైపు అన్నీ తమకే కావాలన్న స్వార్థంతో ట్రంప్ ప్రపంచ దేశాలపై సుంకాల మోత మోగిస్తున్నారు. ప్రపంచంలో అరుదుగా లభించే ఎర్త్ మినరల్స్‌లో ఆధిపత్యం చెలాయిస్తున్న చైనాకు చెక్ పెట్టేందుకు వ్యూహాత్మకంగా పావులు కదువుపుతున్నారు. చైనాపై భారీగా సుంకాలు విధిస్తున్నారు. దీంతో చైనా కూడా ఎక్కడా తగ్గడం లేదు. అగ్రరాజ్యానికే సవాల్ విసురుతోంది. తాజాగా తీసుకున్న నిర్ణయంతో అమెరికా మిలిటరీ టెక్నాలజీకే ఎసరు వచ్చేలా ఉంది. చెనా తాజాగా రేర్ ఎర్త్ ఎగుమతులపై నియంత్రణలు కఠినం చేసింది. ఈ లోహాలే ఆధునిక మిలిటరీ, సెమీకండక్టర్, గ్రీన్ ఎనర్జీ టెక్నాలజీలకు ప్రాణాధారం.అమెరికా,యూరప్, జపాన్ వంటి దేశాలు ఇప్పటి వరకు ఇవి ఎక్కువగా చైనాపై ఆధారపడ్డాయి. ఇప్పుడు బీజింగ్ పట్టుబిగించడంతో ఆ ఆధార వ్యవస్థ కదిలిపోయింది.రేర్ ఎర్త్ మెటల్స్ లో నియోడియమియం, ప్రాసియోడియమియం, డిస్ప్రోస్సియం వంటి లోహాలు ప్రధానమైనవి. వీటితో జెట్ ఇంజిన్లు, క్షిపణి నియంత్రణ వ్యవస్థలు, రాడార్ సెన్సర్లు, మొబైల్ ఫోన్లు నిర్మించబడతాయి. ప్రపంచంలోని సుమారు 70% సరఫరా చైనాకు చెందిన గనుల నుంచే వస్తుంది. ఒక గనిలో ఉత్పత్తిని తగ్గించినా ప్రపంచ మార్కెట్లో ధరలు క్షణాల్లో పెరుగుతాయి.టెక్నాలజీ ఆధిపత్యం కోసం ప్రతిదశలో చైనాకు సవాలు విసిరిన అమెరికా ఇప్పుడు రేర్ ఎర్త్ సరఫరాలో బంధింపబడిన స్థితిలో ఉంది. మిలిటరీ సాధనాలు, జాతీయ రక్షణ పరిశ్రమల ఉత్పత్తి ఆలస్యమవుతోంది. టెక్ కంపెనీలు ప్రత్యామ్నాయ మూలాలు కనుగొనడానికి ప్రయత్నిస్తున్నాయి. కాని తక్షణ పరిష్కారం లేదు. దీంతో వాషింగ్టన్ మళ్లీ భారత్ వంటి మిత్రదేశాల సహకారం కోసం చూస్తోంది.అమెరికా గతంలో వాణిజ్య టారిఫ్‌లతో భారత ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి తెచ్చింది. ఇప్పుడు ఆర్థిక పరిస్థితులు మారడం తో భారత్ సహకారం తప్పనిసరైంది. భారత్‌లోని ఆంధ్రప్రదేశ్, ఒడిశా, రాజస్థాన్‌లలో రేర్ ఎర్త్ ఖనిజ వనరులను అభివృద్ధి చేసే దిశగా ముందుకువెళ్తోంది. ఇది భారత్‌కు ద్విగుణ ప్రయోజనం. ఒకటి వ్యూహాత్మక చర్చల్లో ప్రాధాన్యం పెరగడం. రెండోది అంతర్జాతీ య పెట్టుబడులు ఆకర్షించగలగడం.చైనా “టెక్నాలజీ ఆయుధం”గా రేర్ ఎర్త్‌ను ఉపయోగించడం ప్రారంభించింది. దీంతోఅమెరికా, యూరప్ తమ పరిశ్రమల్లో కొరతను ఎదుర్కొంటున్నాయి. గ్రీన్ ఎనర్జీ (ఇవి వాడే బ్యాటరీలు, టర్బైన్‌లు) ప్రాజెక్టులు మందగిస్తున్నాయి. టెక్ మార్కెట్లలో అనిశ్చితి పెరిగింది. ఈ పరిణామాలు చైనా “సైలెంట్ వెపన్” ప్రభావాన్ని మరోసారి నిరూపిస్తున్నాయి.రేర్‌ఎర్త్ యుద్ధం కేవలంమినరల్ సప్లై పోరు కాదు.. ఇది భవిష్యత్తు టెక్నాలజీ ఆధిపత్యంపై పోరాటం. చైనా ఒకే నిర్ణయంతో ప్రపంచ సరఫరా గొలుసును కుదిపేసింది. భారత్ వంటి దేశాలు ఇప్పుడు వ్యూహాత్మకంగా కొత్త అవకాశాల సరిహద్దులో నిలిచాయి.

# అదానీ సేవలో తరిస్తున్న మోడీ సర్కార్

## భారత గ్రిడ్‌కు గొడ్డా ప్లాంట్ అనుసంధానం

## కొత్త ట్రాన్స్‌మిషన్ పవర్ లైన్‌కు మార్గం సుగమం




న్యూఢిల్లీ : భారత్‌కు చెందిన బడా వ్యాపారవేత్త అదానీ సేవలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పరితపిస్తోంది. ఆయనకు కష్టం వస్తే ఆదుకునేందుకు ముందుండే కేంద్ర ప్రభుత్వం.. మరోసారి దానిని నిరూపించింది. జార్ఖండ్‌లోని గొడ్డా థర్మల్ పవర్ ప్లాంట్‌ను ఇండియన్ నేషనల్ ఎలక్ట్రిసిటీ గ్రిడ్‌కు అనుసంధానించేందుకు లైన్ క్లియర్ చేసింది. ఇందుకు అదానీ పవర్ లిమిటెడ్ (ఎపిఎల్)కు అనుమతిని చ్చింది. అంతర్జాతీయ ఒప్పందం ప్రకారం ఇప్పటివరకు ఈ ప్లాంట్ నుంచి ఉత్పత్తి అయ్యే విద్యుత్ మొత్తం బంగ్లాదేశ్‌కు సరఫరా అయ్యేది. ఇప్పుడు దీనిని భారత గ్రిడ్‌కు అనుసంధానిస్తూ మోడీ సర్కార్ గ్రీన్ సిగల్ ఇవ్వటం గమనార్హం. తాజా నిర్ణయంతో ఏపీఎల్ ఇప్పుడు గొడ్డా ప్లాంట్‌ను భారతదేశ ఇంటర్-స్టేట్ ట్రాన్స్‌మిషన్ సిస్టమ్ (ఐఎస్‌టిఎస్)కు అనుసంధానించే కొత్త ట్రాన్స్‌మిషన్ లైన్ (పవర్‌లైన్) ను వేస్తుంది. ఇది రాష్ట్రాల మధ్య విద్యుత్‌ను తరలించే హై-వోల్టేజ్ జాతీయ గ్రిడ్. ఇది ఇప్పటికే ఉన్న కహల్గావ్ ఏ- మైథాన్ బి 400 కెవి లైన్‌కు లైన్-ఇన్-లైన్-అవుట్ (ఎల్ఐఎల్ఓ) కనెక్షన్‌ను ఉపయోగించి చేయబడుతుంది. ఈ ట్రాన్స్‌మిషన్ లైన్ గొడ్డా జిల్లాలోని 56 గ్రామాల గుండా వెళ్లనున్నది. మోడీ సర్కార్.. అదానీ పవర్‌కు కొన్ని న్యాయ అధికారాలనూ కట్టబెట్టింది. ఇండియన్ టెలిగ్రాఫ్ యాక్ట్, 1885 కింద టెలిగ్రాఫ్ అథారిటీకి ఉండే అధికారాలనే కేంద్రం అదానీ పవర్‌కు కల్పించింది. దీని అర్థం.. ప్రయివేటు ప్రాపర్టీ మీదుగా స్తంభాలు, లైన్లను వేసే అధికారం ఉంటుంది. అయితే దీనికి కొన్ని షరతులు ఉంటాయి. ఎలక్ట్రిసిటీ యాక్ట్, 2003లోని సెక్షన్ 164ను అనుసరించి ఈ అధికారాలను కట్టబెట్టారు.

**కేంద్రం నిర్ణయంపై ఆందోళనలు:** అయితే అదానీ పవర్‌కు మోడీ సర్కార్ మార్గం సుగమం చేసేలా అనుమతివ్వటంపై పలు అనుమానాలు, ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఎందుకంటే.. గొడ్డా ప్లాంట్ స్పెషల్ ఎకనామిక్ జోన్ (సెజ్)లో ఉన్నది.

మార్చి, 2019లో అప్పటి కేంద్రం ప్రభుత్వమే ఈ ప్రకటన చేసింది. ప్రత్యేకించి బంగ్లాదేశ్‌కు విద్యుత్‌ను ఎక్స్‌పోర్ట్ చేసేందుకు ఈ ప్లాంట్‌ను నిర్మించారు. అయితే గతేడాది ఆగస్టులో బంగ్లాదేశ్‌లో అక్కడి ప్రభుత్వం మారింది. కొత్త వచ్చిన తాత్కాలిక ప్రభుత్వం గొడ్డా ప్లాంట్ నుంచి విద్యుత్ కొనుగోలును తగ్గించటం, లేదా ఆపేయటం చేసింది. దీంతో బంగ్లాదేశ్‌కు అవసరం లేకుంటే.. వినియోగంలో లేని ఈ విద్యుత్‌ను భారత్‌లో విక్రయించటానికి అనుమతి కోసం అదానీ పవర్ అభ్యర్థించింది. అదానీ పవర్ కోసం పలు ప్రభుత్వ ఏజెన్సీలు కదిలాయి. నిబంధనలు, మార్గదర్శకాలను సవరించాయి.

**కదిలిన ప్రభుత్వ యంత్రాంగాలు..మారిన నిబంధనలు, మార్గదర్శకాలు:** భారత్‌లో విద్యుత్ విక్రయానికి అనుమతి కోసం గతేడాది ఆగస్టులో అదానీ కంపెనీ అనుమతి కోరింది. దీంతో విద్యుత్ మంత్రిత్వ శాఖ క్రాస్-బోర్డర్ ఎలక్ట్రిసిటీ ట్రేడ్ గైడ్‌లైన్స్‌ను గతేడాది ఆగస్టులో సవరించింది. ఇక గతేడాది ఆగస్టులోనే కేంద్ర విద్యుత్ సంస్థ (సిఇఎ) కూడా తన సాంకేతిక నిబంధనలను మార్చింది. కేంద్ర విద్యుత్ నియంత్రణ కమిషన్ (సిఇఆర్‌సి) సైతం తన నియమాలను అదే ఏడాది డిసెంబర్‌లో సవరించింది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో కేంద్రం ట్రాన్స్‌మిషన్ కనెక్షన్‌కు అధికారికంగా ఆమోదం తెలిపింది. తాజాగా కేంద్రం గ్రీన్ సిగల్ ఇవ్వటంతో అదానీ గొడ్డా ప్లాంట్ నుంచి భారత గ్రిడ్‌కు విద్యుత్ సరఫరాకు మార్గం సుగమమైంది. ఈ అనుమతి 25 ఏండ్ల పాటు చెల్లుబాటు అవుతుంది. ఎపిఎల్.. రైల్వే, రహదార్లు, ఏవియేషన్, రక్షణ వంటి స్థానిక, జాతీయ సంస్థల నుంచి తప్పక అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ ట్రాన్స్‌మిషన్ రూట్ అనేది జీబీ ప్రొటెక్టెడ్ జోన్స్ గుండా వెళ్తే.. కంపెనీ సుప్రీంకోర్టు జారీ చేసిన పర్యావరణ నిబంధనలను తప్పక పాటించాల్సి ఉంటుంది.

**ప్లాంట్ నేపథ్యం:** అదానీకి చెందిన గొడ్డా ప్లాంట్ 1600 మెగావాట్ల సామర్థ్యం కలిగిన థర్మల్ పవర్ స్టేషన్. ఇది జారండ్‌లోని గొడ్డాలో ఉన్నది. ఇది భారతదేశపు మొట్టమొదటి అంతర్జాతీయ విద్యుత్ ప్రాజెక్ట్. దీని ప్రధాన లక్ష్యం బంగ్లాదేశ్‌కు విద్యుత్‌ను సరఫరా చేయడం. ఈ ప్లాంట్ అదానీ గ్రూప్ అనుబంధ సంస్థ అయిన అదానీ పవర్ ద్వారా నిర్వహించబడుతోంది. 2019లో ఈ ప్లాంట్‌ను స్పెషల్ ఎకనామిక్ జోన్‌గా ప్రకటించారు. దీంతో పన్నులు, సుంకాలపై గణనీయమైన రాయితీలను ఈ ప్లాంట్ పొందింది. బంగ్లాదేశ్ పవర్ డెవలప్‌మెంట్ బోర్డు (బిపిడిబి)తో చేసుకున్న దీర్ఘకాలిక ఒప్పందం ప్రకారం ఈ ప్లాంట్ బంగ్లాదేశ్‌కు విద్యుత్‌ను సరఫరా చేస్తోంది. 2023లో ఇది పూర్తిస్థాయి వాణిజ్య కార్యకలాపాలను ప్రారంభించింది. 2024 ఆగస్టులో బంగ్లాదేశ్‌లో పాలనా మార్పుల తర్వాత.. మోడీ ప్రభుత్వం ఈ ప్లాంట్‌ను భారతీయ పవర్ గ్రిడ్‌కు తాత్కాలికంగా అనుసంధానిం చడానికి అనుమతినిచ్చింది. బంగ్లాదేశ్ నుంచి డిమాండ్ తక్కువగా ఉన్నప్పుడు లేదా చెల్లింపుల్లో సమస్యలు తలెత్తినప్పుడు ఈ ప్లాంట్ నుంచి భారత్‌లోని గ్రిడ్‌కు విద్యుత్ సరఫరా చేయడానికి ఇది వీలు కల్పించింది. కేంద్రం తాజా ఆమోదంతో ఈ అనుసంధానానికి 25 ఏండ్ల పాటు శాశ్వత ఆమోదం లభించినట్టయ్యింది.

**గొడ్డా ప్లాంట్‌పై పలు వివాదాలు:** అదానీ గొడ్డా ప్లాంట్‌పై ఇప్పటికే అనేక వివాదాలు ఉన్నాయి. బంగ్లాదేశ్‌లో ఈ ప్లాంట్ నుంచి అధిక ధరకు విద్యుత్ కొనుగోలు చేయడంపై విమర్శలు వచ్చాయి. ఇక భూసేకరణ చట్టం-2013 ను ఉల్లంఘించి మరీ బలవంతంగా భూములను స్వాధీనం చేసుకున్నారనే ఆరోపణలూ వెల్లువెత్తాయి. ఆ సమయంలో స్థానిక రైతులు, గిరిజనులు దీనిపై నిరసనలు కూడా చేశారు. ఈ ప్లాంట్ నిర్మాణంతో పర్యావరణ కాలుష్యం పెరుగుతుం దనీ, కార్మికులకు సరైన ఉపాధి ప్పందాలు లేవని పర్యావరణవేత్తలు, కార్మిక సంఘాల నుంచి ఆందోళనలూ వ్యక్తమయ్యాయి. ఇక విద్యుత్ ఎక్స్‌పోర్ట్ కోసం సెజ్ హోదా పొందినప్పటికీ.. ఈ ప్లాంట్ దేశీయంగా విద్యుత్‌ను విక్రయించేందుకు నిబంధనలను మార్చడం అదానీ గ్రూపునకు మాత్రమే లబ్దిని చేకూరుస్తుందని విశ్లేషకులు, మేధావులు ఆరోపిస్తున్నారు.

# గ్రామపంచాయతీల పునర్ వ్యవస్థీకరణ!

**- 359 రూర్బన్ పంచాయతీల ఏర్పాటు**

**- కార్యదర్శుల పోస్టులను పిడిఒగా మార్పు**

**- ఉద్యోగుల సర్వీసుల్లోనూ భారీగా మార్పులు**



గుంటూరు : రాష్ట్రంలో గ్రామపంచాయతీల వ్యవస్థలో కీలకమైన మార్పులే తేవడానికి రాష్ట్ర ప్రభుత్వం ముమ్మర కసరత్తు చేస్తోంది. ప్రధానంగా పంచాయతీ కార్యదర్శుల వ్యవస్థలో పలు మార్పులకు సన్నద్ధమైనట్టు సమాచారం. పంచాయతీ కార్యదర్శుల్లో ప్రస్తుతం ఉన్న ఆరంచెల వ్యవస్థను నాలుగు అంచెల వ్యవస్థగా మార్పు చేయనున్నారు. ఈ ప్రతిపాదనకు ఈ నెల పదవ తేదిన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఆమోదం తెలిపారు. ఇందుకు సంబంధించి రాష్ట్రంలోని 26 జిల్లాల జిల్లా పంచాయతీ అధికారుల నుంచి సమగ్ర సమాచారాన్ని కూడా ఇప్పటికే ప్రభుత్వానికి చేరినట్లు సమాచారం, వచ్చే వారంలో దీనికి సంబంధించిన తుది ఉత్తర్వులు వెలువడనున్నా యని సమాచారం. నూతన వ్యవస్థలో గ్రామీణ స్థాయిలో అర్బన్ స్థాయి కలిగిన పంచాయతీలను స్పెషల్ గ్రేడ్ పంచాయతీలుగా పరిగణిస్తారు. వీటిని రూర్బన్ (రూరల్, అర్బన్ - ఆర్ అర్బన్) పంచాయతీలుగా నిర్దేశించారు. ఈ పంచాయతీల కార్యదర్శిని రూరల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా (ఆర్‌యుడిఒ) పిలుస్తారు. ప్రస్తుత ‘ఎ’ గ్రేడ్ పంచాయతీ కార్యదర్శులను ఆర్‌యుడిఒగా నియమిస్తారు. రూర్బన్ పంచాయతీలంటే పది వేల జనాభాపైన ఉండి మండల పరిధిలో అత్యధిక ఆదాయం కలిగి ఉండాలి. ఈ విధంగా రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 359 పంచాయతీలను ఇప్పటికే గుర్తించారు. ఈ పంచాయతీల కార్యదర్శులు గెజిటెడ్ హోదా కలిగి ఉంటారు. డిప్యూటీ ఎంపిడిఒలను కూడాఈ పంచాయతీలకు కార్యదర్శులుగా నియమించడానికి కసరత్తు జరుగుతోంది. ఇప్పటి వరకు గ్రామ పంచాయతీల్లో నాలుగు స్థాయిలో కార్యదర్శులుగా పనిచేస్తున్నారు. వీరితోపాటు ఆరేళ్ల క్రితం సచివాలయాల్లో ఎంపిక అయిన పంచాయతీ కార్యదర్శులను ఐదు, ఆరు కేటగిరిలో ఉంచారు. ఆరో కేటగిరి కార్యదర్శి చాలా సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్‌గా కంప్యూటర్‌కు సంబంధించిన అంశాల్లో వినియోగిస్తున్నారు. మొత్తం ఆరెంచల వ్వవస్థను నాలుగు అంచెలుగా మారుస్తున్నారు.

**రద్దు కానున్న క్లస్టర్ విధానం:** ఈ మార్పులతో ఇప్పటి వరకు ఉన్న గ్రామ పంచాయతీల క్లస్టర్ విధానం రద్దు కానుంది. ప్రస్తుతం ఉన్న 7,244 క్లస్టర్ పంచాయతీల విధానాన్ని రద్దు చేసి, 13,351 గ్రామ పంచాయతీలను స్వతంత్ర పరిపాలనా యూనిట్లుగా ఏర్పాటు చేస్తారు. గ్రామ పంచాయతీలకు గ్రేడింగ్ విధానం కొత్తగా తీసుకొస్తున్నారు. నూతనంగా ఏర్నాటు కానున్న రూర్బన్ పంచాయతీలకు రూరల్ అర్బన్ డెవలప్‌మెంట్ ఆఫీసరుగా గ్రేడ్-1 కార్యదర్శులను నియమిస్తారు. రూర్బన్ పంచాయతీలు కాకుండా మిగిలిన పంచాయతీలను మూడు గ్రేడులుగా పునర్వర్గీకరణ చేస్తారు. ఈ మేరకు పంచాయతీల్లోని ఉద్యోగులు, అధికారుల పోస్టుల అప్‌గ్రేడేషన్, పునర్వ్యవస్థీకరణకు జిల్లాల నుంచి ప్రభుత్వం ఇటీవల ప్రతిపాదనలు స్వీకరించింది. ఆయా పోస్టులకు ప్రత్యేక స్కేల్స్ నిర్ణయించింది. అదనపు ఆర్థిక భారం లేకుండా అధికారుల పేర్లు, హోదాను మార్పు చేయనున్నారు. ఇక మీదట పంచాయతీ సెక్రటరీ పోస్టు పేరును పంచాయతీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (పిడిఒ)గా మార్చనున్నట్లు సమాచారం, జూనియర్ అసిస్టెంట్ పోస్టుల అప్‌గ్రేడేషన్‌లో భాగంగా 1,097 సాంక్షన్డ్ స్ట్రెంగ్త్ నుండి 359 జూనియర్ అసిస్టెంట్/జూనియర్ అసిస్టెంట్-కమ్-బిల్ కలెక్టర్ పోస్టులను సీనియర్ అసిస్టెంట్ పోస్టులుగా ఉద్యోగోన్నతి కల్పించి రూర్బన్ పంచాయతీల్లో నియమిస్తారు ఉద్యోన్నతులకు శిక్షణ తప్పనిసరి చేసింది. ఇందులో భాగంగా ఇంటర్-కేడర్ ఉద్యోగోన్నతులకు రెండు వారాల సంస్థాగత శిక్షణ, ఒక సంవత్సరం ఆన్-జాబ్ శిక్షణ అవసరమని నిర్ణయించింది. వేతన స్కేలు మార్పు లేకుండా మినిస్టీరియల్ సిబ్బందికి ఫీల్డ్ అనుభవం, ఎగ్జిక్యూటివ్ సిబ్బందికి ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్‌లో శిక్షణ ఇస్తారు. కొత్తగా డిప్యూటీ ఎంపిడిఒలను ఎంపిక చేయనున్నారు. ఇందులో భాగంగా డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా నియమితులైన డిప్యూటీ మండల పరిషత్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లు ఫౌండేషన్ శిక్షణ పూర్తయిన తర్వాత కనీసం మూడు సంవత్సరాల పాటు రూర్బన్ పంచాయతీల్లో పిడిఒలుగా సేవలందించాలని, గ్రామ పంచాయతీల పర్యవేక్షణలో నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి వీరు పాటుపడాలని నిర్ణయించారు. పంచాయతీల్లో డెడికేటెడ్ ఐటి విభాగం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా సర్ప్లస్ డిజిటల్ అసిస్టెంట్లు, ఇతర అర్హత కలిగిన సిబ్బందిని ఉపయోగించి గ్రామ పంచాయతీ రికార్డులను, పరిపాలనా ప్రక్రియలను డిజిటలైజ్ చేయిస్తారు. వర్క్‌ఫ్లో ఆటోమేషన్, రియల్-టైమ్ పర్యవేక్షణకు ఒక డెడికేటెడ్ ఐటి విభాగాన్ని ఏర్పాటు చేయడానికి డిజిటల్ అసిస్టెంట్ల సేవలను వినియోగించుకుంటారు.

# రోడ్లపైనే మొక్కజొన్న

**వరంగల్,తెలంగాణ దిశ:**రోడ్లపై మొక్కజొన్న పంటలు ఏంటి అనుకుంటున్నారా... నిజమే పంట పొలాల్లో పండించిన మొక్కజొన్న పంట రోడ్లపై కి ఎక్కుతుంది. మహమ్మదాబాద్ మండల పరిధిలో ఎన్ హెచ్ 167 రోడ్డు పక్కనే ఉన్న సర్వీస్ రోడ్లపై కొందరు రైతులు పండించిన మొక్కజొన్న పంట రోడ్లపై ఆరబెడుతున్నారు. ఇక్కడ వర కు బాగానే ఉన్నప్పటికీ రాత్రి సమయంలో న లుపు రంగు గల టార్పలిన్ కవర్లను మొక్కజొన్నపై కప్పి పెడుతున్నారు.రాత్రి స మయం కావడంతో కొంతమంది వాహనచోదకులు బ్లాక్ కవర్ కనిపించకపోవడంతో మొక్కజొన్న కుప్పలు కు తగిలి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటువంటి ఘటనలు మండల పరిధిలో ఇప్పటికే చోటుచేసుకుని ఆసుపత్రి పాలు అయ్యంద్రు. ఆరబెట్టెందుకు సర్వీస్ రేట్లను ఉపయోగించుకుంటున్న కొం తమంది రైతులు వారు వాహన చోదకులకు ఎంత మేరకు ఇబ్బందులు పెడుతున్నారో వారికి తెలియకుండానే ప్రమాదాలకు కారణమవుతున్నారు. వేగంగా వాహనాలు... అ సలే ఎన్ హెచ్ 167 రాత్రి సమయంలో వా హనాలు కొంత వేగం గానే ఉంటాయి.ఈ తరుణంలో కొంత మేరకు పక్కకు జరిగిన ప లు ప్రాంతాలలో పక్కనే ఉన్న మొక్కజొన్న కుప్పలకు తలి తీవ్ర ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వాహన చోదకులు మొరపెట్టుకుంటున్నప్పటికీ ఎవరికి చెప్పాలి ఎవరు తీస్తారులే అనుకుంటూ లోలోపలనే మ దిన పడుతుంద్రు. మహబూబ్‌నగర్ నుంచి తాండూర్, కోస్గి, చించోలి ముంబై తో పాటు పలు ప్రాంతాలకు ఈ రోడ్డు మీదుగా వాహనాలు వెళుతుంటాయి. ఎలాగైనా రైతులకు రోడ్లపై మొక్కజొన్నలు ఉంచకుండా పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి అవసరమైన చర్యలు తీసుకోవాలని వాహన చోదకులు చెబుతున్న మాట.ఎట్టి పరిస్థితుల్లో వాహన చోదకులకు ఇబ్బందులు కలిగించేలా రోడ్లపై మొక్కజొన్ననేకాదు మరి ఇతర పంటలను కూడా ఆరబెట్టకూడదు. ఈ విషయం ప్రతి ఒక్కరికి తె లుసు. నిబంధనలు పాటించకుండా వా హన చోదకులకు ఇబ్బందుల గురిచేస్తే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

# అందుబాటులోకి డిజిటల్ రూపాయి యాప్

ముంబై, : భారతీయ రిజర్వ్ బ్యాంక్ ముంబైలో నిర్వహించిన గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2025లో ఆఫ్‌లైన్ డిజిటల్ రూపాయిని ప్రారంభించింది. ఆఫ్‌లైన్ డిజిటల్ రూపాయి ప్రత్యేకత ఏమిటంటే, మీరు ఇంటర్నెట్ లేదా మొబైల్ నెట్‌వర్క్ లేకుండా కూడా డిజిటల్ చెల్లింపులు చేయవచ్చు. మీరు దీన్ని నగదు రూపాయిల వలె ఖర్చు చేయవచ్చు. దీని కోసంమీరు ఏదైనాక్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయాలి లేదా బటన్ ప్రెస్ చేయాలి. అప్పుడు మీ చెల్లింపు విజయవంతంగా పూర్తవుతుంది. మీరుమీ డబ్బును డిజిటల్ పద్ధతిలో మీ వాలెట్‌లోఉంచుకోవచ్చు. డిజిటల్ రూపాయి లేదా భారతదేశ సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ.మీరు దీనిని భారతీయ రూపాయిడిజిటల్ అవతార్‌అని కూడా చెప్పవచ్చు. మీరు ఇంటర్నెట్ లేకుండా కూడా డిజిటల్ రూపాయిని ఉపయోగించవచ్చు. ఉదాహరణకు, ఇది మీ పర్సులో ఉంచిన నగదు లాంటిదే. తేడా ఏమిటంటే ఇది డిజిటల్ రూపంలో అందుబాటులో ఉంది. మీరు దీన్ని మీ డిజిటల్ వాలెట్‌లో ఉంచుకుని ఆఫ్‌లైన్‌లో ఉపయోగించవచ్చు. అలాగే, మీ ప్రతి లావాదేవీకి బ్యాంక్ ఖాతాకుయాక్సెస్ ఉండవలసిన అవసరం లేదు.ఈ యాప్‌ల లోమిమ్మల్ని మీరు నమోదు చేసుకున్న తర్వాత, మీరు ఏదైనా వ్యక్తి లేదా వ్యాపారానికి డబ్బు చెల్లించగలరు.ఈ ఫీచర్ గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఇక్కడ ఇంటర్నెట్, మొబైల్ నెట్‌వర్క్ సమస్యలు ఉన్నాయి.ప్రత్యేకలక్షణం ఆఫ్‌లైన్ చెల్లింపు. దీనికోసం టెలికాం కంపెనీల సహాయం, ఆధారిత చెల్లింపునకు ఉపయోగపడు తుంది. అంటే, మీరు ఆఫ్‌లైన్ చెల్లింపు చేయడానికి ఇంటర్నెట్ అవసరం లేదు. దీనివల్ల డబ్బు లావాదేవీలు సులభంగా జరుగుతాయి. డిజిటల్ రూపాయి దేశంలోని చాలా బ్యాంకుల్లో వాలెట్‌లుగా అందుబాటులో ఉంది.ఎస్బీఐ,ఐసిఐసిఐ బ్యాంక్, ఎఆఈఅఫస్ట్ బ్యాంక్, జఇూ బ్యాంక్, ఊఆఈఅ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ఆఫ్ బరోడా, కోటక్ మహీంద్రా బ్యాంక్, కెనరా బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, ఫెడరల్ బ్యాంక్, ఇండియన్ బ్యాంక్‌లలో ఇది ప్రారంభమవుతోంది.

# బంగారం ధరలకు కళ్లెమెప్పుడు



దేశీయంగా బంగారు ఆభరణాలకు డిమాండ్ లేకపోయినప్పటికీ బంగారం ధర ఎందుకు పెరుగుతుందా అనే సందేహం కలగవచ్చు. నిజానికి బంగారం ధర పెరగడానికి ప్రధానంగా అంతర్జాతీయ మార్కెట్లే కారణమని చెప్పవచ్చు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రపంచ దేశాల పైన సుంకాల పేరుతో అన్ని దేశాల పైన పన్ను బాదుడు మొదలుపెట్టారు.బంగారం ధర ప్రతిరోజు భారీగా పెరుగుతోంది. అడ్డు అదుపు లేకుండా పసిడి ధరలు పెరగడానికి ప్రధానంగా అంతర్జాతీయ మార్కెట్లో పరిస్థితులే కారణమని నిపుణులు పేర్కొంటున్నారు. ఓవైపు భారీగా పెరిగిన ధరల నేపథ్యంలో పసిడి ఆభరణాలు కొనుగోలు చేసేందుకు జనాలు షాపులకు రావడం లేదు. మరోవైపు తయారీదారులకు కూడా భారీగా పెరిగిన పసిడి ధరలతో ఆభరణాలు తయారు చేయాలంటే కూడా 24 క్యారెట్ల గోల్డ్ బిస్కెట్లను కొనుగోలు చేయడానికి పెద్ద ఎత్తున ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు మార్కెట్లో ఆశించినంత సేల్స్ లేకపోవడంతో పసిడి వ్యాపారులు సైతం పెద్ద ఎత్తున నష్టపోతున్నారని చెప్పవచ్చు. పెరుగుతున్న ధరల వల్ల అటు కస్టమర్లు, అలాగే మరోవైపు బంగారు ఆభరణాల తయారీదారులు సైతం నష్టపోతున్నారు. డిమాండ్ తగ్గిపోవడంతో పాటు, ముడి బంగారం ధర భారీగా పెరిగిపోవడం వల్ల అటు తయారీ దారులకు కూడా పెద్ద ఎత్తున నష్టం వాటిల్లే పరిస్థితి ఏర్పడింది. ఇదిలా ఉంటే అటు దేశీయంగా బంగారు ఆభరణాలకు డిమాండ్ లేకపోయినప్పటికీ బంగారం ధర ఎందుకు పెరుగుతుందా అనే సందేహం కలగవచ్చు. నిజానికి బంగారం ధర పెరగడానికి ప్రధానంగా అంతర్జాతీయ మార్కెట్లే కారణమని చెప్పవచ్చు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రపంచ దేశాల పైన సుంకాల పేరుతో అన్ని దేశాల పైన పన్ను బాదుడు మొదలుపెట్టారు. దీంతో ప్రపంచవ్యాప్తంగా వాణిజ్యం పెద్ద ఎత్తున దెబ్బతిన్నది అని చెప్పవచ్చు. ఫలితంగా ఇన్వెస్టర్లు స్టాక్ మార్కెట్లో తమ పెట్టుబడులను బంగారం వైపు తరలించడం ప్రారంభించారు. సాధారణంగా బంగారాన్ని సురక్షితమైన పెట్టుబడి సాధనంగా చెబుతుంటారు.అంతర్జాతీయ మార్కెట్లలో ఎప్పుడూ ఒడిదుడుకులు ఏర్పడినప్పటికీ ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను బంగారం వైపు తరలిస్తుంటారు. దీంతో పసిడి ఆభరణాల డిమాండ్ తో సంబంధం లేకుండా అంతర్జాతీయ మార్కెట్లలో బంగారం ధర పెరగడం ప్రారంభించింది. చైనా సెంట్రల్ బ్యాంకు సైతం పెద్ద ఎత్తున ముడి బంగారం కొనుగోలు చేసిన నేపథ్యంలో బంగారం డిమాండ్ భారీగా పెరిగిపోయి ధరలు కూడా ఒక్కసారిగా ఆకాశాన్ని తాకడం ప్రారంభించాయి. చరిత్రలో ఎప్పుడు లేని విధంగా బంగారం ధర ఒక ఔన్స్ 3000 డాలర్ల నుంచి 4000 డాలర్లకు ఈ ఏడాది పెరగింది. ఫలితంగా బంగారం ధర దేశీయ మార్కెట్లలో ఏకంగా 24 క్యారెట్ల 10 గ్రాములకు గానూ 1.30 లక్షల రూపాయలకు తాకింది. డాలర్ విలువ పుంజుకోవడం ద్వారా బంగారం విలువ కూడా తగ్గే అవకాశం ఉంటుంది. అమెరికా డాలర్ విలువ పెరగడానికి ట్రంప్ సర్కార్ చర్యలు తీసుకున్నట్లయితే బంగారం ధర కూడా తగ్గే అవకాశం ఉంటుంది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్లు పెంచినట్లయితే, అమెరికా జారీ చేసే ట్రెజరీ బాండ్ల యీల్డ్ రాబడి పెరుగుతుంది అప్పుడు ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను బంగారం వైపు నుంచి తరలించి అమెరికా జారీ చేసే ట్రెజరీ బాండ్ల వైపు పెడతారు. ఫలితంగా బంగారం ధర తగ్గే అవకాశం ఉంటుంది.రాజకీయ అస్థిరత, వాణిజ్య వివాదాలు, భౌగోళిక ఉద్రిక్తతల కారణంగా పెట్టుబడిదారులు బంగారం వైపు మొగ్గు చూపుతారు. ఈ స్థాయిలో పెరుగుతున్న
గోల్డ్ త్వరలోనే పతనం కానుందని అంటున్నారు,ఈ సంవత్సరం బంగారం ధరలు భారీగా పెరిగాయి. వార్షిక ప్రాతిపదికన బంగారం ధర దాదాపు 61 శాతం పెరిగింది, ఇది షేర్లు, బాండ్లు, ఇతర పెట్టుబడి సాధనాలతో పోలిస్తే పెట్టుబడిదారులకు అత్యధిక రాబడిని అందించే ఎంపికగా నిరూపితమైంది. అయితే, రాబోయే రోజుల్లో ఈ పెరుగుదల కొనసాగుతుందా లేదా బంగారం ధరలు తగ్గుతాయా అనే ప్రశ్న ఇప్పుడు మార్కెట్లో తలెత్తుతోంది.
బ్యాంక్ ప్రకారం, వచ్చే ఏడాది బంగారం ధరలు భారీగా పడిపోయే అవకాశం ఉంది. ఈ సంవత్సరం బంగారం రికార్డు స్థాయికి చేరుకోవడానికి ప్రధాన కారణాలు భౌగోళిక-రాజకీయ ఉద్రిక్తత, ఆర్థిక అనిశ్చితి, డాలర్ బలహీనత, జూ వడ్డీ రేట్లలో మార్పులుగా భావిస్తున్నారు. స్పాట్ గోల్డ్ ఇప్పటివరకు అత్యధికంగా ఔన్సుకు వి4,225.69కి చేరుకుంది, ఆ తర్వాత 0.4 శాతం పెరిగి వి4,224.79కి చేరుకుంది.ప్రపంచ మార్కెట్లలో అనిశ్చితి లేదా సంక్షోభం ఏర్పడినప్పుడల్లా, పెట్టుబడిదారులు సురక్షితమైన ఆస్తిగా బంగారంలో పెట్టుబడులు పెంచుతారు. రాయిటర్స్ ద్వారా ఉటంకించిన నివేదిక ప్రకారం, ఈ సంవత్సరం చివరి నాటికి బంగారం ధరలు ఔన్సుకు వి4,400 వరకు చేరుకోవచ్చు, అయితే 2026 జూన్ నాటికి ఇది వి4,600 చుట్టూ ఉండవచ్చు. అయితే, వచ్చే ఏడాది ద్వితీయార్థంలో ధరలు భారీగా తగ్గే అవకాశం ఉంది. రాజకీయ అస్థిరత, సుంకాల వివాదాలు, భౌగోళిక-రాజకీయ ఉద్రిక్తత వంటి కారణాల వల్ల పెట్టుబడిదారులు ఇప్పటికీ బంగారం వైపు ఆకర్షితులవుతారు. 2026 మధ్య నాటికి వెండి ధరలు ఔన్సుకు వి57.50కి చేరుకోవచ్చని కూడా నివేదిక అంచనా వేసింది. అయితే, జూ ఫెడరల్ రిజర్వ్ కఠినంగా వ్యవహరిస్తే లేదా జూ ఆర్థిక వ్యవస్థ ఊహించిన దానికంటే మెరుగ్గా రాణిస్తే, దీనికి వ్యతిరేక ప్రభావం ఉండవచ్చు. బంగారం ధరలు తగ్గుతాయి.

## ప్రతి మద్యం బాటిల్‌పై ఉండే క్యూఆర్ కోడ్




**విజయవాడ,,తెలంగాణ దిశ :**ఆంధ్రప్రదేశ్‌లో నకిలీ మద్యం విక్రయాలను అరికట్టేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 'ఏపీ ఎక్సైజ్ సురక్షా యాప్'ను ప్రవేశపెట్టారు. ఈ యాప్ ద్వారా ప్రతి మద్యం బాటిల్‌పై ఉండే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి.. అది నిజమైనదా కాదా తెలుసుకోవచ్చు. మద్యం షాపుల్లో అమ్మే ముందు బాటిళ్లను స్కాన్ చేయడం తప్పనిసరి చేస్తూ కొత్త నిబంధనలు అమలు చేస్తున్నారు రాష్ట్రవ్యాప్తంగా మద్యం విక్రయాల్లో పారదర్శకత పెంచి, నకిలీ మద్యం మాఫియాను నిర్మూలిస్తా యని ప్రభుత్వం చెబుతోంది. ఆంధ్రప్రదేశ్ స్టేట్ బెవరేజెస్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అమలవుతున్న ఈ నిబంధనలు అక్టోబర్ 13 నుంచి రాష్ట్రవ్యాప్తంగా దశలవారీగా అమలు చేస్తున్నారు. కొత్త రూల్స్ ప్రకారం క్యూఆర్ కోడ్ స్కానింగ్ తప్పనిసరి చేశారు. ప్రతి మద్యం బాటిల్‌పై జియో-ట్యాగ్ చేసిన క్యూఆర్ కోడ్ ఉంటుంది. షాపుల్లో అమ్మే ముందు ఈ కోడ్‌ను స్కాన్ చేయాలి. ఇది బాటిల్ డిస్ట్రిబ్యూషన్, తయారీ, డెస్టినేషన్ వివరాలు చూపిస్తుంది. జియో-ట్యాగింగ్ వల్ల బాటిళ్లు నిర్దేశిత ప్రాంతాల్లో మాత్రమే విక్రయించాల్సి ఉంటుంది. బెల్టు దుకాణాలకు మద్యం వెళ్లదు. వినియోగదారులు 'ఏపీ ఎక్సైజ్ సురక్షా' యాప్‌ను డౌన్‌లోడ్ చేసి, బాటిల్‌పై క్యూఆర్ కోడ్ స్కాన్ చేయవచ్చు. ఇది బాటిల్ ఆథెంటిక్ కాదా, మాన్యుఫాక్చర్ డేట్, ఎక్స్‌పైరీ, బ్యాచ్ నంబర్ వంటి వివరాలు చూపిస్తుంది. యాప్ గూగుల్ ప్లే స్టోర్‌లో అందుబాటులో ఉంది. మద్యం షాపుల లైసెన్స్ హోల్డర్లు స్కానింగ్ ప్రక్రియను అనుసరించకపోతే, లైసెన్స్ రద్దు, జరిమానాలు విధిస్తారు. ఇది రాష్ట్రంలోని 3,500కు పైగా మద్యం షాపులకు వర్తిస్తుంది. డిజిటల్ పేమెంట్ సిస్టమ్‌ను కూడా ఇంటిగ్రేట్ చేశారు. షాపుల్లో జఖఎ/ఖీఖీ కోడ్ ద్వారా పేమెంట్స్ చేయవచ్చు, కానీ ఇది క్యూఆర్ కోడ్ స్కానింగ్‌తో సంబంధం లేదు. ఏపీలో ఇటీవల నకిలీ లిక్కర్ తయారు చేసే ముఠా పట్టుబడింది. అందుకే ఈ యాప్ సాయంతో నకిలీ లిక్కర్ అనేది లేకుండా చేయాలని నిర్ణయించారు. స్పెషల్ టాస్క్ ఫోర్స్‌లు ఏర్పాటు చేసింది. షాపుల్లో స్కానర్లు, ట్రైనింగ్ ఇస్తున్నారు. వినియోగదారులు యాప్ డౌన్‌లోడ్ చేసి, ఫీడ్‌బ్యాక్ ఇవ్వవచ్చు. ఇది బ్లాక్ మార్కెట్, బెల్ట్ షాపులను అరికట్టి, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతుందని అధికారులు తెలిపారు.

# కొండా పదవికి ఎసరు?



**హైదరాబాద్,తెలంగాణ దిశ :** కొండా సురేఖ మంత్రిపదవికి ఎసరు వచ్చింది. ఆమెను తప్పించేందుకు రంగం సిద్ధమైనట్టు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యమంత్రి, మంత్రులపై ఆమె కుమార్తె చేసిన వ్యాఖ్యలతోపాటు కొండ సురేఖ కూడా సన్నిహితుల వద్ద ఇలాంటి కామెంట్స్ చేసినట్టు తెలుస్తోంది. అంతే కాకుండా మొదటి నుంచి ఆమె వివాదాల్లో ఇరుక్కోవడం తర్వాత ప్రభుత్వం వాటిని సమర్థించుకోవడం సాధారణంగా మారింది. ఇప్పటి వరకు ఎక్కువ వివాదాల్లో ఇరుక్కున్న మంత్రిగా కొండా సురేఖ పేరు పొందారు. కేటీఆర్, నాగార్జున ఫ్యామిలీ ఇష్యూలపై మాట్లాడటం, తర్వాత ఓ ప్రైవేటు పార్టీలో మందు గురించి మాట్లాడటం, తోటి మంత్రులతో గిల్లికజ్జాలు, ఇలా వివిధ రకాలైన వివాదాల్లో ఇరుకుంటూ వస్తున్నారు. ఇప్పుడు వెలుగు చూసిన వివాదం మరింత రచ్చకెక్కింది. ఏకంగా ఓ కంపెనీ ప్రతినిధులను గన్‌తో బెదిరించిన వ్యక్తికి వంతపాడుతూ కాపాడే ప్రయత్నం చేయడంతో ముఖ్యమంత్రి సీరియస్‌గా ఉన్నట్టు తెలుస్తోంది. కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్ధమయ్యారు. మొదటి నుంచి వివాదాల మంత్రిగా ఉన్న కొండా సురేఖపై మొత్తం మంత్రిమండలే గుర్రుగా ఉన్నట్టు తెలుస్తోంది. అందుకే దీనిపై అధినాయకత్వానికి ఫిర్యాదు చేసి తప్పించాలని చూస్తున్నారు. బుధవారం నుంచి ఓఎస్‌డీ చుట్టూ రాజుకున్న వివాదంలో ఆమె కుమార్తె చేసిన కామెంట్స్ మరింత కాక రేపాయి. ఏకంగా టెండర్ల పేర్లతో, సెటిల్మెంట్ల పేర్లతో దోపిడీ జరుగుతుంది అని సిట్టింగ్ మినిస్టర్ కూతురే కామెంట్స్ చేయడం అందర్నీ ఆశ్చర్యపరిచింది. సీఎం అనుచరుడు రోహిణ్ రెడ్డి దందాలు చేస్తున్నారని, సీఎం బ్రదర్స్ కొండల్ రెడ్డి, తిరుపతి రెడ్డి గురించి, రేవంత్ అంతర్గత విషయాలపై సుస్మిత బహిరంగంగా మీడియా ముందు విమర్శలు చేశారు. వీటన్నింటిపై గుర్రుగా ముఖ్యమంత్రి ఇంకా కొండా సురేఖను కొనసాగిస్తే వాటికి సమ్మతించినట్టు అవుతుందని భావిస్తున్నారట. అందుకే ఆమెను తప్పించేందుకు సిద్ధమయ్యారని అంటున్నారు. మేడారం పనుల టెండర్లతో మొదలైన వివాదం ఇప్పుడు మరింత పీక్స్ వెళ్లింది. అప్పటి నుంచి ముఖ్యమంత్రి మీటింగ్స్‌కు కొండా సురేఖ దూరంగా ఉంటున్నారు. ఇవాళ కేబినెట్‌కు వస్తారో రారో కూడా తెలియడం లేదు. అందుకే ఇంత గ్యాప్ వచ్చిన తర్వాత టీంగా పని చేయడం కష్టమని సీఎం సన్నిహితులు చెబుతున్నారు. కొండా సురేఖను తప్పించేందుకు అధిష్ఠానం ఓకే చెబుతుందా లేదా అన్నది మాత్రం అనుమానంగా ఉంది. అసలే బీసీల కోసం పోరాడుతున్న పార్టీగా ఎస్టాబ్లిష్ అవుతున్నారు. ఈ టైంలో ఓ బీసీ మహిళను తప్పిస్తే ఎలాంటి పరిణా మాలు ఉంటాయనేది బేరీజు వేసుకుంటున్నారు. దీనికి కౌంటర్‌గా ఏం చేయాలనే విషయంపై చర్చలు జరుపుతున్నట్టు తెలుస్తోంది. అసలే జూబ్లీహిల్స్ ఉపఎన్నికలు, మరోవైపు లోకల్ బాడీ ఎన్నికల వేళ కొండా సురేఖపై తీసుకునే నిర్ణయం పార్టీకి ఇబ్బంది లేకుండా ఏం చేయాలో ఆలోచిస్తున్నారు. అసలే కోర్టు వివాదాలతో బీసీ సంఘాలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నాలు నిరసనలు చేపడుతు న్నారు. ఈ టైంలో ఈ నిర్ణయం తీసుకుంటే వచ్చే పరిణామాలపై సమాలోచనలు జరుపుతున్నారు. సురేఖతో పార్టీ పెద్దలు మాట్లాడి ఆమెకు స్వతహాగా తప్పుకునేలా కూడా ఒప్పించే ఛాన్స్ ఉందని అంటున్నారు. తనపై తన అనుచరులపై ఆరోపణలు వచ్చినందుకు అవి నిర్దారణ అయ్యే వరకు పదవికి దూరంగా ఉంటానని చెప్పే ఆస్కారం లేకపోలేదని, దీని వల్ల రెండు వర్గాలను కూల్ చేసినట్టు అవుతుందని కూడా పార్టీలోని ఓ వర్గం ప్రయత్నాలు చేస్తోంది.

# అనంతలో రేమండ్ గ్లోబల్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్లు

అనంతపురం, : ఏపీలో మరో ప్రఖ్యాత సంస్థ పెట్టుబడులతో వచ్చింది. రేమండ్ గ్రూప్ ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లాలో రెండు గ్లోబల్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్లు స్థాపించనుంది. ఏరోస్పేస్ మరియు ఆటోమోటివ్ సెక్టార్లలో ఈ ప్రాజెక్టులు రూ.1,000 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు కానున్నాయి. ఇవి 5,400 ఉద్యోగాలు సృష్టిస్తాయి, రూ. 695 కోట్ల ప్రభుత్వ ప్రోత్సాహకాలు పొందనున్నా యి. రేమండ్ గ్రూప్ ఏరోస్పేస్, ఆటో కాంపోనెంట్లలో తన వ్యాపారాలను విస్తరిస్తోంది. స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డ్ ఈ ప్రాజెక్టులకు ఇప్పటికే క్లియరెన్స్ ఇచ్చింది. మొత్తం రూ.943 కోట్ల పెట్టుబడికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూ.695 కోట్లకు పైగా ప్రోత్సాహ కాలు ఇస్తుంది . ఏరోస్పేస్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్ గుడిపల్లిలో, ఆటోమోటివ్ యూనిట్ టెకులోడు గ్రామంలోఏర్పాటుకానున్నాయి ఏఐ మైని ప్రెసిషన్ టెక్నాల జీ కింద రూ.430 కోట్ల పెట్టుబడితో స్థాపిస్తారు. ఈ ప్రాజెక్టు 4,096 మందికి నేరుగా ఉద్యోగాలు కల్పిస్తుంది. ఏఐ మైని గ్లోబల్ ఏరోస్పేస్ కింద 47 ఎకరాల్లో రూ.510 కోట్ల పెట్టుబడితో నిర్మాణం జరుగు తుంది.1,400 ఉద్యోగాలు సృష్టిస్తుంది.ఈ ప్రాజెక్టులు రేమండ్ గ్రూప్‌ను హై-ప్రెసిషన్ ఇంజినీరింగ్,ఆటో మరియుఏరోస్పేస్ కాంపోనెంట్లలో మరింత బలోపేతం చేస్తాయి. 2023లో మైని ప్రెసిషన్ ప్రొడక్ట్స్‌లో మె జారిటీ స్టేక్ కొనుగోలు చేసి, రేమండ్ గ్రూప్ ఏరోస్పేస్ మాన్యుఫాక్చ రింగ్‌లోకి అడుగుపెట్టింది. 1973లో స్థాపించబడిన మైని ప్రెసిషన్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ ఆటోమోటివ్ మరియు ఇండస్ట్రియల్ కాంపోనెంట్ల మాన్యుఫాక్చరింగ్‌లో బలమైన వారసత్వం కలిగి ఉంది. 2004లోఏ రోస్పేస్‌లోకి అడుగుపెట్టి, గ్లోబల్ ఎయిర్‌క్రాఫ్ట్ ఒరిజినల్ ఎక్విప్‌మె ంట్ మాన్యుఫాక్చరర్లకు మిషన్-క్రిటికల్ కాంపోనెంట్లు సరఫరా చేస్తోంది. ఏఐ మైని గ్లోబల్ ఏరోస్పేస్ లిమిటెడ్ ఏరోస్పేస్ మాన్యుఫా క్చరింగ్, ప్రెసిషన్ ఇంజినీరింగ్,
హై-కాంప్లెక్సిటీ కాంపోనెంట్లు తయారీలో గ్లోబల్ ౦ాఇఓబ, టియర్-ఎ సప్లయర్లకు విశ్వసనీయ పేరు. ఈ ప్రాజెక్ట్‌కు అనంతపురం ఎంపిక కావడంలో కీలక పాత్ర పోషించింది ంఖ ప్రభుత్వ పారిశ్రామిక విధానాలు. టెక్స్‌టైల్ రాజు రేమండ్, ఇప్పుడు అనంతపురం నుంచి ప్రపంచానికి హై-టెక్ భాగాలను పంపించబో తున్నది. ఇది కేవలం ఒక వెయ్యికోట్ల పెట్టుబడి కాదు?ఇది ంఖ భవిష్యత్తుపై, మౌలిక సదుపాయాలపై, యువతపై రేమండ్ నమ్మకం. సాంప్రదాయేతర రంగాల్లో ఉపాధి అవకాశాలు, స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఊపునిచ్చే శక్తి, మరియు అనంతపురాన్ని దేశంలోనే ఒక ఏరోస్పేస్- ఆటోమోటివ్ హబ్‌గా తీర్చిదిద్దే శక్తివంతమైన అడుగుగా భావిస్తున్నారు.

# సింహపురిలో సైనికుల తగువలాటలు

**నెల్లూరు,తెలంగాణ దిశ :**ఉమ్మడి నెల్లూరు జిల్లాలో జనసేన పార్టీ ప్రభావం అంతంత మాత్రమే. 2024 ఎన్నికలకు ముందు అప్పటి జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు మనుక్రాంత్ రెడ్డి జనసేనను వీడి వైసీపీలోకి వెళ్లడంతో అప్పటి నుంచి పార్టీ పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. గునుకుల కిషోర్, నూనె మల్లికార్జున యాదవ్, సుజయ్ బాబు, నలిశెట్టి శ్రీధర్, వంటి నాయకులు తప్ప చెప్పుకోదగ్గ నాయకులెవరూ ఆ పార్టీలో లేకుండా పోయారు. దీంతో జనసేన పార్టీ ప్రభావం ఉమ్మడి నెల్లూరు జిల్లాలోపెద్దగా కనిపించేది కాదు. ఉన్న నాయకులే ఏదో ఒక కార్యక్ర మంతో జనాల్లోకి వస్తూ పార్టీని ఎంతో కొంత బలోపేతం చేయాలని ప్రయత్నించే వారు. జనసేన పార్టీ ఉమ్మడి నెల్లూరు జిల్లాలో బలోపే తం దిశగా ముందుకెళ్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో జనసేన నేతల వర్గ విభేదాలు ఒక్కసారిగా బయటపడ్డాయి. జనసేన నేత, టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్‌ను టార్గెట్ చేసుకొని పార్టీలో మొదటి నుంచి ఉన్న నియోజకవర్గ ఇంచార్జ్‌లందరూ తిరుగుబాటు ఎగురవేశారు. అజయ్ కుమార్‌యాంటీవర్గం అంతాఏక మై ఆరోపణ లు, విమర్శలు గుప్పిస్తున్నారు.జిల్లాలో పార్టీని అజయ్ కుమార్ సర్వ నాశనం చేస్తున్నారని.. పార్టీని రోడ్డున పడేస్తున్నారని మండిపడుతు న్నారు. తామందరం కష్టపడితే.. లాబీయింగ్ చేసి అజయ్ కుమార్ పదవి తెచ్చుకున్నారనేది ఆయన వ్యతిరేక వర్గం వాదన. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పనిచేసిన నాయకులందరినీ పక్కన పెట్టేసి తన వర్గానికి చెందిన కొత్త వారికే ప్రాధాన్యత ఇస్తున్నారని అజయ్ కుమార్ తీరును తప్పుబడుతున్నారు. అంతేకాక జనసేన నియోజకవర్గ ఇంచార్జిలకు పనులు చేయొద్దంటూ.. మంత్రులకు, ఎమ్మెల్యేలకు అజయ్ కుమార్ సూచిస్తున్నారని ఆరోపిస్తున్నారు.పార్టీ అధికారంలోకి రావడా నికి తామంతా కృషి చేస్తే.. తమ కష్టాన్ని అధిష్టానం దగ్గర తాకట్టు పెట్టి అజయ్ కుమార్ నామినేటెడ్ పదవి తెచ్చుకుని ఇలా చేస్తున్నారని విమర్శిస్తున్నారు. జిల్లాలో పార్టీ కోసం ఏనాడూ పని చేయకుండా, ఇప్పుడు పదవితో నెల్లూరుకు వచ్చి పార్టీలో గ్రూపులు కట్టి, గందరగో ళానికి దారితీస్తున్నాడని ఫైర్ అవుతున్నారు. ఎన్నికల సమయంలోనే వెంకటగిరి నియోజకవర్గ ఇంచార్జ్‌గా ఉన్న గూడూరు వెంకటేశ్వర్లు సైతం అజయ్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారట. జిల్లాలో పార్టీని నాశనం చేస్తున్నారంటూ తీవ్ర విమర్శలు అప్ప ట్లో కలకలం రేపాయి. జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని అజయ్‌పై విమర్శలు వచ్చాయి.వేములపాటి అజయ్‌కుమార్ మొన్నటి వరకు కూడా రాజకీయాల్లో పెద్దగా పరిచయం లేని వ్యక్తి. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, నాగబాబులతో సన్నిహిత సంబంధాలున్న వ్యక్తి. ప్రభుత్వంలో జనసేన భాగమైనప్పటి నుంచి..నెల్లూరు జిల్లాలో అన్ని తానై వ్యవహరిస్తున్నారట. నెల్లూరు సిటీ నియోజకవర్గంలో జనసేనకు క్యాడర్ ఉంది. కోవూరు, వెంకటగిరి, ఆత్మకూరులో కూడా ఎంతో కొంత కార్యకర్తలు ఉన్నారు. ఆయా నియోజకవర్గాల్లో అజయ్ కుమార్ మరొక వర్గాన్ని ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.పవన్ కల్యాణ్, నాగబాబు దగ్గరికి ఎవరినీ పోనివ్వకుండా..అంతా తానే అన్నట్లు అజయ్ కుమార్ వ్యవహరిస్తున్నారట. ఇదే జనసేన పార్టీలో ముందు నుంచి పనిచేస్తున్న నేతలకు ఆగ్రహం తెప్పిస్తుందట. అజయ్ కుమా ర్‌ను కాదని ఎవరైనా పవన్ కల్యాణ్‌ను గానీ, నాదెండ్ల మనోహర్‌ను కానీ కలిస్తే వారిని దూరం పెట్టేలా వ్యవహరిస్తున్నారట. అందుకే నెల్లూరు నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్ బాబు ఆధ్వర్యంలో..జనసేన నియోజకవర్గ ఇంచార్జ్‌లంతా ఒక్కతాటిపైకి వచ్చి దుమ్మెత్తిపోస్తున్నా రట. అజయ్ కుమార్‌కు సన్ని హిత సంబంధాలు ఉన్నప్పటికీ పార్టీ బలోపే తం చేయకుండా గ్రూప్‌లను ప్రోత్సహిస్తున్నారని మండిపడుతున్నారు. పార్టీ బలోపేతా నికి ఒక్క కార్యక్రమం కూడా ఆయన చేయడం లేదట. సొంతంగా కార్యక్రమం చేసేవారిని సైతం అడ్డుకుని ఇబ్బంది పెడుతున్నారట. అజయ్ కుమార్ లాంటి వ్యక్తులు నెల్లూరు జనసేనలో ఉంటే పార్టీ ఎప్పటికీ బలోపేతం కాదని నేతలు అధిష్టానానికి ఫిర్యాదు చేశారట

# విన్నంతలో ఎన్ని వింతలో..



సంగీతం కాలక్షేపానికి సాధనం కాదు. శ్రావ్యమైన సంగీతం ఓ థెరపీ. మనసును ప్రశాంతంగా ఉంచే సాధనం ఇది. సంగీతానికి రోగాలను నయం చేసే శక్తి ఉందని పలు పరిశోధనల్లో తేలింది. చక్కటి పాటలు, మ్యూజిక్ వినడం వల్ల రక్త ప్రసరణ సజావుగా సాగుతుందనీ, ఊపిరితిత్తులు లయబద్ధంగా పనిచేస్తాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అమృతగానం వింటూ ఆదమరిస్తే.. మానసిక ఆందోళనలు తోకముడుస్తాయని అంటున్నారు. ఒత్తిడి నుంచి ఉపశమనానికి సంగీతాన్ని మించిన మార్గం లేదు. అయితే, మానసిక ఒత్తిడికిగురైనప్పుడు పాటలు కాకుండా..వాద్య సంగీతం వింటే మరింత మేలు కలుగుతుందట. ఉదయం కోడి కూసే వేళకు తోడిరాగం ఆస్వాదించండి.. తక్షణ ఉపశమనం లభించడం ఖాయం. పాటలు వింటూ వ్యాయామం చేయడం వల్ల ఎక్కువ ఫలితం లభిస్తుంది. బరువు తగ్గాలని భావించేవారు సంగీతం వింటూ వ్యాయామం చేస్తే ఫలితాలు బాగుంటాయట. మనలో మరింత ఉత్సాహం పెరుగుతుంది. మానసికంగా, శారీరకంగా కూడా ఉల్లాసంగా ఉండవచ్చు. ఒళ్లు నొప్పులు తగ్గించడంలోనూ సంగీతం గుణం చూపిస్తుందని ఎన్నో పరిశోధనల్లో తేలింది. అందుకే కొందరికి సర్జరీ సమయంలో, ఆ తర్వాత కూడా మంచి సంగీతం వినమని డాక్టర్లు చెబుతారు. గాయాలపాలైనప్పుడు రోజూ సంగీతం వినడం వల్ల నొప్పి నుంచి త్వరగా ఉపశమనం లభిస్తుంది. పిల్లల మెదడు ఎదుగుదలకూ సంగీతం తోడ్పడుతుంది. జోల పాటలు, రైమ్స్ వంటివివిపిల్లల్లో ఐక్యూ స్థాయిని పెంచుతాయి. పాటలు వింటూ పెరిగేపిల్లలు, మిగతా వారితో పోల్చితే మరిన్ని తెలివితేటలు కలిగి ఉంటారని వైద్యులు చెబుతున్నారు. మహిళలు గర్భంతో ఉన్నప్పుడు మంచి సంగీతం వినడం వల్ల వారి కడుపులోని బిడ్డ కదలికల్లో మార్పు వస్తుందట. నెలలు నిండకుండా పుట్టిన పిల్లల్లోనూ ఆరోగ్యం మెరుగయ్యేందుకు సంగీతం సాయపడుతుంది. ఎన్నో మానసిక వ్యాధులచికిత్సలో సంగీతం ఉపయోగపడుతుంది. అల్జీమర్స్ సమస్య ఉన్న వారు సంగీతం వింటే మతి మరుపును అధిగమించవచ్చు. ఆటిజంతో బాధపడుతున్న వారికి మ్యూజిక్ థెరపీ వల్ల వారి కమ్యూనికేషన్ స్కిల్స్ పెరుగుతాయి. డిప్రెషన్, ఆత్రుత, కోపం, భయం వంటి వాటిని తగ్గించే శక్తి సంగీతానికి ఉంది.

# కారంగా ఉంటుందని పచ్చిమిర్చిని పక్కన పెట్టేస్తున్నారా..

## ఈ లాభాలు తెలిస్తే ఇకపై అలా చేయరు..!

ఒకప్పుడు మన పూర్వీకులతోపాటు పెద్దలు కూడా పచ్చి మిర్చిని రోజూ తినేవారు. దీన్ని వారు తమ రోజువారి ఆహారంలో భాగం చేసుకునేవారు. చద్దన్నంలో పచ్చి మిర్చిని నంజుకుని తినేవారు. అయితే పచ్చి మిర్చి వల్ల కలిగే లాభాలు తెలిస్తే ఎవరైనా దీన్ని ఇష్టంగా తింటారు. ఒకప్పుడు మన పూర్వీకులు వీటిని రోజూ తినేవారు. అందుకనే వారు ఎంత వయస్సు వచ్చినా ఆరోగ్యంగా ఉండేవారు. ఈ క్రమంలోనే పచ్చి మిర్చిని ఆహారంలో భాగం చేసుకుంటే అనేక లాభాలు పొందవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. పచ్చి మిర్చి కారంగా ఉంటుందని చాలా మంది తినేందుకు ఆసక్తిని చూపించరు. కూరల్లో వచ్చినా పడేస్తుంటారు. కానీ పచ్చి మిర్చిలో మన శరీరానికి కావల్సిన అనేక పోషకాలు ఉంటాయి. ఇవి మనల్ని ఆరోగ్యంగా ఉంచుతాయి.

రోగ నిరోధక శక్తికి..: పచ్చి మిర్చిలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. నారింజ పండ్లలో కన్నా పచ్చి మిర్చిలోనే అధికంగా విటమిన్ సి ఉంటుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. కనుక పచ్చిమిర్చిని ఆహారంలో భాగం చేసుకుంటే రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. దీంతో శరీరం వ్యాధులు, ఇన్ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాడుతుంది. రోగాలు రాకుండా చూస్తుంది. పచ్చి మిర్చిలో బీటా కెరోటిన్ అధికంగాఉంటుంది. ఇది మన శరీరంలో విటమిన్ ఎ గా మారుతుంది. దీంతో కంటి చూపు మెరుగు పడుతుంది. కళ్ల సమస్యలు తగ్గిపోతాయి. వృద్ధాప్యంలో వచ్చే శుక్లాలు రాకుండా అడ్డుకోవచ్చు.

బరువు తగ్గేందుకు..: పచ్చి మిర్చిలో విటమిన్ బి6, బి9 అధికంగా ఉంటాయి. ఇవి మన శరీర మెటబాలిజంను మెరుగు పరుస్తాయి. దీంతో క్యాలరీలు ఖర్చవుతాయి. కొవ్వు కరిగి అధిక బరువు తగ్గుతారు. ఈ విటమిన్ల వల్ల నాడీ మండల వ్యవస్థ ఆరోగ్యం



మెరుగు పడుతుంది. నరాల బలహీన తగ్గుతుంది. మెడ, భుజాల నొప్పుల నుంచి ఉపశ మనం లభిస్తుంది.ఎర్ర రక్త కణాలుఉత్పత్తి అవుతాయి.రక్తం పెరుగు తుంది. రక్తహీనత తగ్గుతుంది. పచ్చిమిర్చిలో అనేక రకాల యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి.ఇవి ఆక్సీకరణఒత్తిడిని తగ్గిస్తాయి.దీంతో క్యాన్స ర్, డయాబెటిస్, గుండె జబ్బులు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. జీర్ణక్రియకు..: పచ్చిమిర్చిలో క్యాప్సెయిసిన్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది థర్మోజెనిక్ గుణాలను కలిగి ఉంటుంది. అంటే శరీర ఉష్ణోగ్రతను కాసేపు పెంచుతుందన్నమాట. దీంతో మెటబాలిజం పెరుగుతుంది. ఫలితంగా క్యాలరీలు ఖర్చయి కొవ్వు కరుగుతుంది. కాబట్టి పచ్చి మిర్చిని తింటుంటే బరువును తగ్గించుకోవడం తేలికవుతుంది. పచ్చి మిర్చిని తింటే కడుపు నిండిన భావన కలుగుతుంది. దీంతో ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. ఫలితంగా ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయపడుతుంది. పచ్చి మిర్చిని అధికంగా తింటే కడుపులో మంట వస్తుంది. కానీ మోతాదులో తింటే జీర్ణ క్రియకు సహాయ పడతాయి. తిన్న ఆహారం సరిగ్గా జీర్ణం అయ్యేలా చేస్తాయి. ఇలా పచ్చిమిర్చితో అనేక ప్రయోజనాలను పొందవచ్చు.

# అశ్వగంధ.. ఓ అద్భుతమైన మూలిక..

## ఇది అందించే ప్రయోజనాలు అమోఘం..

ఆయుర్వేదంలో అనేక రకాల మూలికలు ఉన్నాయి. అవి అనేక ఔషధ విలువలను కలిగి ఉంటాయి. అనేక రకాల ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందిస్తాయి. వాటిల్లో అశ్వగంధ కూడా ఒకటి. దీని పేరు మీరు వినే ఉంటారు. అశ్వగంధనే ఇండియన్ జిన్సెంగ్ అని, వింటర్ చెర్రీ అని కూడా పిలుస్తారు. ఇది మనకు మార్కెట్‌లో ఎక్కువగా పొడి రూపంలో లభిస్తుంది. అశ్వగంధకు చెందిన వేర్లను పొడిగా తయారు చేసి మనకు విక్రయిస్తారు. దీన్ని రాత్రి పూట పాలలో కలిపి తాగాల్సి ఉంటుంది. అశ్వగంధ చూర్ణాన్ని రోజూ తీసుకుంటే అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని ఆయుర్వేద వైద్య నిపుణులు చెబుతున్నారు. అనేక వ్యాధులను నయం చేసే శక్తి అశ్వగంధకు ఉందని వారు అంటున్నారు. అశ్వగంధ మనకు అనేక అద్భుతమైన లాభాలను అందిస్తుందని వారు చెబుతున్నారు. అశ్వగంధ ఒత్తిడి హార్మోన్లను తగ్గిస్తుంది. దీంతో ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. మైండ్ రిలాక్స్ అవుతుంది. మానసిక ప్రశాంతత లభిస్తుంది. నేటి తరుణంలో చాలా మంది నిత్యం ఒత్తిడి, ఆందోళనను ఎదుర్కొంటున్నారు. అలాంటి వారు అశ్వగంధను వాడుతుంటే ప్రయోజనం ఉంటుంది. ఈ పొడిని తీసుకుంటే మైండ్ రిలాక్స్ అయి నిద్ర కూడా చక్కగా పడుతుంది. పడుకున్న వెంటనే గాఢ నిద్రలోకి జారుకుంటారు. నిద్రలేమి తగ్గుతుంది. అశ్వగంధ పొడిని తీసుకోవడం వల్ల శరీరం ఉత్సాహంగా మారుతుంది. యాక్టివ్‌గా ఉంటారు. చురుగ్గా పనిచేస్తారు. బద్ధకం పోతుంది. నీరసం, అలసట తగ్గుతాయి. ముఖ్యంగా రాత్రి పూట దీన్ని తీసుకుంటే మరుసటి రోజు మొత్తం ఉత్సాహంగా ఉంటారు.

పురుషుల శృంగార సామర్థ్యానికి.. శారీరక శ్రమ లేదా వ్యాయామం చేసేవారు కండరాల నొప్పుల బారిన పడుతుంటారు. అలాంటి వారు అశ్వగంధ చూర్ణాన్ని పాలతో కలిపి తీసుకుంటే ఆయా నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. తిరిగి పనిచేసేందుకు కావల్సిన శక్తి శరీరానికి లభిస్తుంది. కండరాలు నిర్మాణమవుతాయి. దేహం చక్కని ఆకృతిని పొందుతుంది. అశ్వగంధను తీసుకోవడం వల్ల ఊపిరితిత్తులు



ఆక్సిజన్‌ను మరింత ఎక్కువగా శోషించుకుంటాయి. దీంతో ఊపిరితిత్తుల సామర్థ్యం సైతం పెరుగుతుంది. గొంతు, ఊపిరితిత్తుల్లో ఉండే కఫం పోతుంది. దగ్గు, జలుబు వంటి శ్వాసకోశ సమస్యలు రాకుండా చూసుకోవచ్చు. అశ్వగంధ పురుషుల్లో శృంగార సామర్థ్యాన్ని పెంచుతుంది. ఇది వారి జననావయవాలకు రక్త సరఫరా జరిగేలా చూస్తుంది. దీంతో శృంగారంపై ఆసక్తి పెరుగుతుంది. వీర్యం వృద్ధి చెందుతుంది. సంతానం కలిగే అవకాశాలు మెరుగు పడతాయి.

మెదడు పనితీరుకు..: అశ్వగంధను తీసుకోవడం వల్ల మెదడు పనితీరు మెరుగు పడుతుంది. జ్ఞాపకశక్తి, ఏకాగ్రత పెరుగుతాయి. మతిమరుపు తగ్గుతుంది. అశ్వగంధ యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలను కలిగి ఉంటుంది. అందువల్ల ఈ పొడిని తీసుకుంటే శరీరంలోని వాపులు, నొప్పులు తగ్గుతాయి. ముఖ్యంగా ఆర్థరైటిస్ నుంచి ఉపశమనం లభిస్తుంది. డయాబెటిస్ ఉన్నవారికి కూడా అశ్వగంధ మేలు చేస్తుంది. దీన్ని తీసుకుంటే షుగర్ లెవల్స్ తగ్గుతాయి.

.అశ్వగంధ పొడి ఇమ్యూనిటీ పవర్‌ను పెంచుతుంది. దీని వల్ల సీజనల్ గా వచ్చే దగ్గు, జలుబు వంటి సమస్యలకు చెక్ పెట్టవచ్చు. ఇలా మనకు అశ్వగంధ అనేక ప్రయోజనాలను అందిస్తుంది. అయితే దీన్ని తీసుకునే ముందు డాక్టర్ సలహాను పాటించాలి. కొందరికి ఇది పడకపోవచ్చు. కనుక డాక్టర్ సలహా మేరకు దీన్ని వాడుకుంటే మంచి ఫలితాలను రాబట్టవచ్చు.

# ఆరోగ్యంగా ఉన్నప్పుడే..



మనిషి ఆరోగ్యంగా ఉన్నప్పుడు చేసే దాన ధర్మాలే నిజమైనవి. మంచి పనులు చేయాలని భావించి దానికి కట్టుబడి ఉండాలి. తన శక్తి మేరకు దైవ మార్గంలో ధనాన్ని ఖర్చు పెట్టాలి, దానాలు చేయాలి. మంచి పనులు చేస్తూ చనిపోతే తగినంత పుణ్యఫలం వస్తుంది. అయితే జీవితమంతా మంచిపనులు, దానాలు చేయకుండా కేవలం ముసలితనంలో, మరణ దశలో చేయడం సత్ఫలితాలను ఇవ్వవు. అల్లాహ్‌ను విశ్వసించి, ఆయన మార్గంలో పోరాడటం, దానం చేయడం ఉత్తమమైన సత్కార్యం. పని రాని వాళ్లకు పనిచేసి పెట్టడం, పనిచేసే వాళ్లకు సాయపడటం కూడా పుణ్య ఫలితాన్ని కలిగించేవే. ప్రతి తస్బీహ్ పలుకు ఒక సత్కార్యమే. అల్లాహ్‌ను కీర్తించడం, మంచిని ఆదేశించడం కూడా మంచిపనులే. సాటివారిని నవ్వుతూ పలకరించే మంచి నడవడిక కూడా మంచిపనే. ఇతరులను మాటలతో కాని, చేతలతో కాని హింసించకుండా ఉండటం కూడా గొప్పపనే. అందరూ ప్రార్థనలు చేసే మసీదులను శుభ్రం చేయడం దైవానికి ఇష్టమైన మంచిపని. ఇతరుల కోసం, భావితరాల కోసం పండ్ల చెట్లను నాటడం ఎంతో పుణ్యకార్యం. కష్టపడి చేసిన సత్కార్యానికి పుణ్యఫలం ఎక్కువగా ఉంటుంది. మన దగ్గర ఉన్న గుక్కెడు మేకపాలతో ఇతరుల దాహార్తి తీర్చినా పుణ్యప్రదమే. మంచి మనసుతో ఒక్క ఖర్జూరపు ముక్క దానం చేసినా మనం నరకాగ్ని నుంచి తప్పుకోవచ్చు. భూతదయ కలిగి ఉండటం, నలుగురు నడిచే బాటను శుభ్రం చేయడం, నమాజు కోసం మసీదు వైపు వేసే అడుగులు, ఇతరుల తగాదా పరిష్కరించడమూ మంచిపనుల ఖాతాలోకే వస్తాయి.

## అందానికి సబ్జా సాయం!

సబ్జా గింజలు.. ఆరోగ్యానికి ఎంతో మేలుచేస్తాయి. ముఖ్యంగా, వేసవిలో వేధించే వేడిని తగ్గిస్తాయి. శరీరం నుంచి టాక్సిన్స్‌ను బయటికి పంపడంలోనూ సాయపడుతాయి. అయితే, అందాన్ని కాపాడటంలోనూ సబ్జా గింజలు ముందుంటాయి. చర్మాన్ని లోలోపలి నుంచి శుభ్రం చేయడంలో సబ్జా గింజలు సమర్థంగా పనిచేస్తాయి. వీటిలో సహజంగా ఉండే డీటాక్స్ గుణాలు.. చర్మం లోపలి పొరల్లో చేరిన టాక్సిన్లను బయటికి పంపిస్తాయి. దాంతో చర్మం కాంతిమంతంగా మారుతుంది. మొటిమలూ తగ్గుముఖం పడతాయి. తక్కువ క్యాలరీలు, అధిక ఫైబర్‌తో నిండిన సబ్జా గింజలు.. ఆకలిని నియంత్రిస్తాయి. ఫలితంగా బరువు తగ్గడంలో సాయపడతాయి.సబ్జా గింజల్లో ఉండే యాంటి బయోటిక్, యాంటి ఫంగల్, యాంటి మైక్రోబియల్ లక్షణాలు.. చర్మ ఇన్‌ఫెక్షన్లను తగ్గిస్తాయి. ఇందుకు కారణమయ్యే బ్యాక్టీరియా, ఇతర సూక్ష్మజీవుల పెరుగుదలను నిరోధించడంలో సహాయ పడతాయి. సబ్జాలో ఉండే చర్మ స్థితిస్థాపక లక్షణాలు.. చర్మం త్వరగా కోలుకోవడానికి తోడ్పడతాయి. చర్మానికే కాదు.. జుట్టుకూ సబ్జా గింజలు మంచి పోషణ అందిస్తాయి. వీటిలో అధికంగా లభించే విటమిన్ కె, బీటా కెరోటిన్, ఇతర ప్రొటీన్లు.. జుట్టు, కుదుళ్లు దృఢంగా ఉండేలా చేస్తాయి. వీటిని క్రమం తప్పకుండా తీసుకుంటే.. జుట్టు రాలే సమస్య తగ్గుతుంది.



## సీజనల్ వ్యాధుల నుంచి ఉపశమనం పొందాలంటే..

# ఈ ఆకుల జ్యూస్‌ను తీసుకోవాల్సిందే..!

ప్రతి ఏడాది లాగా కాకుండా ఈసారి కాస్త ముందుగానే వర్షాకాలం సీజన్ వచ్చింది. ప్రతి ఏడాది జూన్ 3వ వారంలో ఈ సీజన్ మొదలవుతుంది. కానీ మే నెల చివరి వారంలోనే అనూహ్యంగా నైరుతి రుతు పవనాలు ప్రవేశించాయి. దీంతో వాతావరణం చల్లబడింది. వేసవి తాపం నుంచి ఉపశనం లభించింది. అయితే అంతా బాగానే ఉంటుంది కానీ సీజన్ మారినప్పుడు దగ్గు, జలుబు, జ్వరం అందరినీ ఇబ్బందులకు గురి చేస్తుంటాయి. ఈ సీజన్‌లో దోమలు విజృంభిస్తాయి. దీంతో డెంగీ, మలేరియా వంటి విష జ్వరాలు కూడా ప్రబలుతుంటాయి. అయితే ఈ సీజన్ లో మన ఆరోగ్యం సురక్షితంగా ఉండాలంటే ఇమ్యూనిటీ పవర్‌ను పెంచుకోవాల్సి ఉంటుంది. దీంతో రోగాలు, ఇన్‌ఫెక్షన్లు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. ఇమ్యూనిటీ పవర్ పెరగాలంటే అందుకు బొప్పాయి ఆకులు ఎంతగానో ఉపయోగపడతాయి.

జీర్ణ సమస్యలకు..: బొప్పాయి ఆకుల పేరు చెప్పగానే అందరికీ డెంగీ జ్వరానికి సంబంధించిన ప్లేట్‌లెట్ల విషయమే గుర్తుకు వస్తుంది. డెంగీ వచ్చిన వారిలో ప్లేట్‌లెట్ల సంఖ్య తగ్గుతుంది. దీంతో బొప్పాయి ఆకుల రసం సేవించాలని వైద్యులు సూచిస్తుంటారు. దీంతో ప్లేట్‌లెట్ల సంఖ్య పెరిగి త్వరగా జ్వరం నుంచి కోలుకుంటారు. అయితే బొప్పాయి ఆకులు కేవలం ఇందుకే కాదు, ఇంకా అనేక రకాల అనారోగ్య సమస్యలకు ఔషధంగా పనిచేస్తాయి. బొప్పాయి ఆకుల జ్యూస్‌ను సేవిస్తుంటే జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. ఈ ఆకుల జ్యూస్‌లో పపైన్, కైమోపపైన్ అనే ఎంజైమ్‌లు ఉంటాయి. ఇవి మనం తిన్న ఆహారాన్ని సులభంగా జీర్ణం చేస్తాయి. కనుక అజీర్తి ఉన్నవారు ఈ ఆకుల రసాన్ని తాగుతుంటే ఎంతగానో ఉపశమనం లభిస్తుంది. తిన్న ఆహారం జీర్ణమై అజీర్తి తగ్గుతుంది. అలాగే గ్యాస్, కడుపు ఉబ్బరం, అసిడిటీ నుంచి సైతం ఉపశమనం లభిస్తుంది.

షుగర్ తగ్గేందుకు..: జీర్ణాశయంలో అల్సర్లు ఉన్నవారు బొప్పాయి ఆకుల రసాన్ని తాగుతుంటే ఫలితం ఉంటుంది. మలబద్దకం ఉన్నవారికి కూడా ఈ ఆకులు ఔషధంగా పనిచేస్తాయి. బొప్పాయి ఆకుల్లో పపైన్‌తోపాటు ఫ్లేవనాయిడ్స్, విటమిన్ ఇ అధికంగా ఉంటాయి. ఇవి యాంటీ ఇన్ ఫ్లామేటరీ కారకాలుగా పనిచేస్తాయి. అందువల్ల బొప్పాయి ఆకుల రసాన్ని తాగితే శరీరంలోని వాపులు, నొప్పులు తగ్గిపోతాయి. ముఖ్యంగా ఆర్థరైటిస్, కీళ్ల నొప్పులు, కండరాల నొప్పులు, చర్మంపై దద్దుర్లు ఉన్నవారికి ఎంతగానో ప్రయోజనం ఉంటుంది. ఆయా సమస్యలను వెంటనే తగ్గించుకోవచ్చు. ఈ ఆకుల రసాన్ని సేవిస్తుంటే షుగర్ లెవల్స్ కంట్రోల్‌లో ఉంటాయని పలువురు సైంటిస్టులు జంతువులపై చేసిన అధ్యయనాల్లో వెల్లడైంది. బొప్పాయి ఆకుల రసాన్ని సేవిస్తుంటే ఇన్సులిన్ సరిగ్గా ఉత్పత్తి అవుతుంది. దీన్ని శరీరం సక్రమంగా వినియోగించుకుంటుంది. దీంతో షుగర్ లెవల్స్ తగ్గుతాయి. డయాబెటిస్ అదుపులో ఉంటుంది.

రోగ నిరోధక శక్తికి..: బొప్పాయి ఆకుల్లో విటమిన్లు ఎ, సి, ఇలతోపాటు అనేక యాంటీ ఆక్సిడెంట్లు కూడా ఉంటాయి. ఇవి ఫ్రీ ర్యాడికల్స్ బారి నుంచి చర్మ కణాలను రక్షిస్తాయి. దీంతో కొల్లాజెన్ ఉత్పత్తి పెరుగుతుంది. ఇది చర్మం కాంతివంతంగా మారేలా చేస్తుంది. చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. చర్మంపై ఉండే ముడతలు, మచ్చలు, మొటిమలు పోతాయి. యవ్వనంగా కనిపిస్తారు. బొప్పాయి ఆకుల్లో విటమిన్ సి అధికంగా ఉంటుంది.

ఇది రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. వివిధ రకాల ఇన్‌ఫెక్షన్లు, వ్యాధులు రాకుండా చూస్తుంది. బొప్పాయి ఆకుల పేస్ట్‌ను జుట్టుకు నేరుగా అప్లై చేయవచ్చు.

దీంతో చుండ్రు, దురద, జుట్టు రాలడం తగ్గిపోతాయి. జుట్టు ఒత్తుగా పెరిగి దృఢంగా, ఆరోగ్యంగా ఉంటుంది. ఇలా బొప్పాయి ఆకులతో అనేక లాభాలను పొందవచ్చు. అయితే బొప్పాయి ఆకుల రసాన్ని రోజుకు 2 సార్లు, పావు టీస్పూన్ మోతాదులోనే తీసుకోవాలి. ఎక్కువగా తీసుకుంటే అలర్జీలు వచ్చి వికారం, వాంతికి వచ్చినట్లు ఉండడం, విరేచనాలు అవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. అలర్జీలు ఉన్నవారు ఈ జ్యూస్‌ను సేవించకూడదు.

# మేనికి.. పసుపు నూనె



ఆరోగ్యంతోపాటు అందాన్ని కాపాడటంలో 'పసుపు' ముందుంటుంది. అయితే, పసుపు మొక్క వేళ్ల నుంచి తీసిన నూనె కూడా అందాన్ని అందలం ఎక్కిస్తుందని సౌందర్య నిపుణులు చెబుతున్నారు. ముఖంపై మొటిమలు, మచ్చలకు కారణమయ్యే సీబమ్ ఉత్పత్తిని క్రమబద్ధం చేయడంలో పసుపు నూనె సమర్థంగా పనిచేస్తుంది. ఫలితంగా మొటిమల బెడద తగ్గుతుంది. పసుపు నూనెలో ఉండే యాంటి ఆక్సిడెంట్లు, యాంటి ఇన్‌ఫ్లమేటరీ గుణాలు.. చర్మానికి కావాల్సిన తేమను అందించి, పొడి చర్మం సమస్యను దూరం చేస్తాయి. ఇక ముఖంపై ముడతలు, గీతలను నివారించడం వల్ల మేనిఛాయ మరింత మెరుగవుతుంది.

పసుపు నూనెలో యాంటి మైక్రోబియల్ గుణాలు సమృద్ధిగా ఉంటాయి. ఇందులో ఉండే 'కర్క్యుమిన్' అనే సమ్మేళనం.. చర్మ సంబంధ ఇన్ఫెక్షన్లు రాకుండా కాపాడుతుంది. మొటిమలు, తామర, సొరియాసిస్ వంటి చర్మ సమస్యలనూ తగ్గిస్తుంది. ముఖంపై ఏర్పడే కొన్ని రకాల మచ్చలనూ నివారిస్తుంది.

ఇందులోని యాంటి ఆక్సిడెంట్స్.. ఫ్రీరాడికల్స్‌ను సమతుల్యం చేస్తాయి. చర్మకణాలు దెబ్బతినకుండా కాపాడి.. వృద్ధాప్య ప్రక్రియను నెమ్మదింపజేస్తాయి. చర్మంపై మడతలు, మచ్చల్ని దూరం చేస్తాయి. దాంతో.. చర్మం ఎప్పుడూ యవ్వనంగా కనిపిస్తుంది.

# సినిమా..

## జగధాత్రి నటి దీప్తి మన్నె పెళ్లి పీటలెక్కబోతుంది..



టెలివిజన్ ప్రపంచంలో తన అందం, అభినయం, క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో అభిమానుల మనసుల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న నటి దీప్తి మన్నె త్వరలో పెళ్లి పీటలెక్కబోతోంది. రాధమ్మ కూతురు', 'జగధాత్రి'లి సీరియల్స్‌తో గుర్తింపు తెచ్చుకున్న దీప్తి, తన జీవితంలోని కొత్త అధ్యాయాన్ని ప్రారంభించబోతున్నట్లు స్వయంగా వెల్లడించింది. మొన్నటి వరకు కాబోయే భర్త ముఖాన్ని గోప్యంగా ఉంచిన దీప్తి, ఇప్పుడు సోషల్ మీడియాలో అతని ఫేస్ రివీల్ చేసింది. తన కాబోయే జీవిత భాగస్వామి పేరు రోహన్ అని ప్రకటించింది.ఇన్‌స్టాగ్రామ్‌లో ఇద్దరూ కలిసి దిగిన ఫోటోలను షేర్ చేస్తూ .. "ప్రియమైన రోహన్, నేను ఎదురు చూసిన వ్యక్తివి నువ్వే. దేవుడు ఇచ్చిన అత్యంత అందమైన బహుమతి నువ్వు. నన్ను నీ జీవిత భాగస్వామిగా ఎంచుకున్నందుకు ధన్యవాదాలు. నేను నిన్ను ప్రేమిస్తున్నాను" అంటూ భావోద్వేగ పూరిత క్యాప్షన్ రాసింది. జీ టీవీ కుటుంబం సాక్షిగా ఈ హ్యాపీ న్యూస్‌ను ప్రకటించిన దీప్తికి సహ నటీనటులు, సీరియల్ టీమ్ సభ్యులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఆమెకు ప్రత్యేక బహుమతులు అందజేసి, వివాహ జీవితం సుఖశాంతులతో నిండాలని ఆకాంక్షించారు. దీప్తికి తెలుగు, కన్నడ భాషల్లో విశేషమైన అభిమాన వర్గం ఉంది. కన్నడలో 'పద్మావతి' సీరియల్‌తో పేరు తెచ్చుకున్న ఆమె, తెలుగులో 'రాధమ్మ కూతురు'
ద్వారా ఎక్కువ గుర్తింపు పొందింది. ప్రస్తుతం 'జగధాత్రి' సీరియల్‌లో నటిస్తూ ప్రేక్షకులనుఅలరిస్తోంది. బెంగళూరుకు చెందిన దీప్తి మన్నె, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ నుంచి డిగ్రీ పూర్తి చేసింది. నటనపై ఉన్న ఆసక్తితో ఆడిషన్‌లలో పాల్గొని తమిళ చిత్రం 'అవాన్' ద్వారా సినీ రంగ ప్రవేశం చేసింది. అనంతరం 'నమ్మూర్ హైక్లు' , 'ఇక్ సే లవ్'లి, 'దేవదాస్ బ్రదర్స్' వంటి చిత్రాల్లో నటించి, తర్వాత టెలివిజన్ వైపు మళ్లింది. దీప్తి-రోహన్ జంట ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, అభిమానులు ఈ జంటకు ప్రేమతో శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

## శర్వానంద్‌తో శ్రీను వైట్ల తదుపరి మూవీ





శ్రీను వైట్ల ఒకప్పుడు తెలుగులో క్రేజీయెస్ట్ డైరెక్టర్. యువ కథానాయకులతోనే కాదు స్టార్ హీరోలతోనూ సినిమాలు చేసి తన సత్తాను చాటుకున్నారు. శ్రీను వైట్ల దర్శకత్వం వహించిన కొన్ని సినిమాలు బ్లాక్ బస్టర్ సక్సెస్ ను అందుకున్నాయి. అయితే... 2011లో వచ్చిన 'దూకుడు' తర్వాత మళ్ళీ శ్రీను వైట్ల ఆ స్థాయి విజయాన్ని అందుకోలేకపోయారు. అంతేకాదు... 2018లో వచ్చిన 'అమర్ అక్బర్ ఆంథోని' సినిమా తర్వాత ఆయన ఏకంగా ఐదేళ్ళు దర్శకత్వానికి దూరంగా ఉండాల్సి వచ్చింది. ఇక గత యేడాది 'విశ్వం' సినిమాతో మళ్ళీ లైమ్ లైట్ లోకి వచ్చిన శ్రీను వైట్ల... ఆ తర్వాత ఎట్టకేలకు ఓ ప్రాజెక్ట్ ను సెట్ చేయగలిగాడు. 'ఢీ' సినిమా తర్వాత దానికి సీక్వెల్ గా మంచు విష్ణుతోనే శ్రీను వైట్ల సినిమా చేస్తాడనే ప్రకటన వచ్చింది. కానీ అది పట్టాలెక్కలేదు. ఈ లోగా గోపీచంద్ హీరోగా 'విశ్వం' సినిమాను శ్రీను వైట్ల తెరకెక్కించాడు. ఇది థియేటర్లలో పెద్దంత ఆడకపోయినా... ఓటీటీలో బాగానే వీక్షకులను మెప్పించింది. అప్పటి నుండి మరో సినిమాను సెట్ చేసే పనిలో శ్రీను వైట్ల ఉన్నాడు. ఆ మధ్య నితిన్ హీరోగా శ్రీను వైట్ల ఓ సినిమా చేయబోతున్నాడనే ప్రచారం జరిగింది. అయితే ఇప్పుడు శర్వానంద్ తో శ్రీను వైట్ల ప్రాజెక్ట్ లాక్ అయ్యిందని తెలుస్తోంది. 'విశ్వం'కు రచన చేసిన నందు ఈ సినిమాకూ వర్క్ చేస్తున్నాడని అంటున్నారు. శ్రీను వైట్ల చెప్పిన కథ నచ్చడంతో శర్వానంద్ ఈ సినిమా చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడట. దాంతో మిగిలిన నటీనటులు, టెక్నీషియన్స్ ను సెట్ చేసే పనిలో శ్రీను వైట్ల ఉన్నాడట. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ అతి త్వరలోనే అధికారిక ప్రకటన చేస్తుందని, వచ్చే యేడాది ప్రారంభంలో ఇది సెట్స్ పైకి వెళుతుందని అంటున్నారు. మరి శర్వా – శ్రీను వైట్ల తొలి కాంబినేషన్ లో రాబోతున్న ఈ సినిమాతో మరోసారి వీరిద్దరూ సక్సెస్ ట్రాక్ ఎక్కుతారేమో చూడాలి.

## బిగ్ బాస్ హౌజ్‌కి ఇద్దరు కెప్టెన్లు..



బిగ్ బాస్ తెలుగు సీజన్ 9 ఆరో వారం ఎపిసోడ్ ప్రేక్షకులను పూర్తిగా ఎంటర్‌టైన్ చేసింది. పాత కంటెస్టెంట్లు, వైల్డ్ కార్డ్ ఎంట్రీలు మధ్య మాటల యుద్ధం, డ్రామా, ఎమోషన్‌లతో హౌజ్ సందడి చేసింది. ముఖ్యంగా దివ్వెల మాధురీ ఎంట్రీ తర్వాత హౌజ్‌లో వాతావరణం పూర్తిగా మారిపోయింది. ఆమె రూల్స్ సెట్ చేస్తూ, డిక్టేటర్‌లా వ్యవహరిస్తూ హౌజ్‌ను తన అధీనంలో ఉంచుతోంది. ఈ వారం బిగ్ బాస్ ఇచ్చిన కెప్టెన్సీ టాస్క్ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ టాస్క్‌లో మూడు జంటలు పోటీ పడ్డాయి. సుమన్ శెట్టి–గౌరవ్ గుప్తా, దివ్వెల మాధురీ–ఆయేషా, రమ్య–శ్రీనివాస సాయి మూడు జంటలుగా విడిపోయి "శవపేటిక టాస్క్"లో తమ లాక్ కనుక్కొని గంట కొట్టే ఛాలెంజ్ పాల్గొనాల్సి ఉంటుంది. మొదటగా ఆయేషా ప్రయత్నించినా లాక్ తీయలేకపోయింది. కానీ గౌరవ్ గుప్తా తన పార్టనర్ సుమన్ శెట్టి లాక్ తీయగలిగాడు. దీంతో ఈ జంట విజేతలుగా నిలిచింది. బిగ్ బాస్ తొలిసారిగా ఇద్దరిని సంయుక్తంగా కెప్టెన్లుగా ప్రకటించడం హౌజ్‌లో సంచలనం సృష్టించింది. దీంతో ఏడో వారానికి సుమన్ శెట్టి, గౌరవ్ గుప్తా ఇద్దరూ కెప్టెన్లుగా హౌజ్ బాధ్యతలు చేపట్టారు. కెప్టెన్సీ బ్యాడ్జ ధరించిన తర్వాత సుమన్ శెట్టి "నీతితో, నిజాయితీతో ఉంటాను" అంటూ ప్రమాణస్వీకారం చేశాడు. ఆ వెంటనే "అధ్యక్షా!" అంటూ తన తొలి చిత్రం జయం ని గుర్తు చేసేలా పర్ఫార్మెన్స్ ఇచ్చాడు. అతని ఉత్సాహానికి ఇమ్మాన్యుయెల్ కూడా ఫిదా అయ్యారు.. ఇక టాస్క్‌లో తాను ముందుగా వచ్చినా లాక్ తీయలేకపోయానని అయేషా ఎమోషనల్ అయ్యింది. ఫెయిల్ అయినందుకు బాధపడి కన్నీళ్లు పెట్టుకుంది. అయితే కెప్టెన్లు సుమన్ శెట్టి, గౌరవ్ ఆమెకు బెడ్ ఇచ్చి ఓదార్చడంతో ఆమె మనసు కొంచెం సాంత్వన పొందింది. ఇక ఎపిసోడ్ మధ్యలో కిచెన్ ప్రాంతంలో ఆయేషా, జీనత్, రీతూ చౌదరీల మధ్య పనులపై ఘర్షణ చోటుచేసుకుంది. ఇందులో పవన్ కూడా జోక్యం చేసుకోవడంతో వాతావరణం మరింత వేడెక్కింది. మొత్తానికి 40వ ఎపిసోడ్ డ్రామా, ఎమోషన్, హాస్యం, సర్‌ప్రైజ్‌ల మేళవింపుతో సాగింది. వచ్చే ఎపిసోడ్‌లో జంట కెప్టెన్సీ ఎలా పనిచేస్తుందో చూడాలి.

## నా కోడళ్ల వల్ల నా జీవితం కొత్తగా మారింది



టాలీవుడ్ అందాల నటి, ప్రఖ్యాత సీనియర్ యాక్ట్రెస్ అమల అక్కినేని ప్రస్తుతం సినిమాలకంటే కుటుంబానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. మూడేళ్ల క్రితం విడుదలైన 'ఒకే ఒక జీవితం' చిత్రంతో ఆమె చివరిసారిగా తెరపై కనిపించారు. అప్పటి నుంచి కొత్త సినిమాలకు సైన్ చేయకపోయినా, ఆమె పబ్లిక్ లైఫ్‌లో చురుకుగా ఉంటున్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న అమల అక్కినేని, తన కోడళ్లైన శోభిత ధూళిపాల నాగ చైతన్య భార్య), జైనబ్ (అఖిల్ అక్కినేనిభార్య) గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అమల మాట్లాడుతూ.."నాకు అద్భుతమైన కోడళ్లు ఉన్నారు. వాళ్లు మంచి వ్యక్తిత్వం కలవారు. వాళ్ల వల్ల నా జీవితం కొత్తగా అనిపిస్తోంది. మా ఇంట్లో ఇప్పుడు నాకు 'గర్ల్స్ సర్కిల్' ఏర్పడింది," అంటూ నవ్వుతూ చెప్పారు. మల తన స్వభావం గురించి చెబుతూ "నా కోడళ్లు ఇద్దరూ చాలా బిజీగా ఉంటారు, అది మంచి విషయం. యువత ఉత్సాహంగా, సృజనాత్మకంగా ఉండటం అవసరం. వాళ్లు తమ పనుల్లో బిజీగా ఉంటే నేను నా పనుల్లోనే ఉంటాను. సమయం దొరికినప్పుడు మేమంతా కలిసి సరదాగా గడుపుతాం. నేను డిమాండ్ చేసే అత్తను కాదు అలాగే డిమాండ్ చేసే భార్యను కూడా కాదు," అంటూ చిరునవ్వుతో చెప్పారు. తన కుమారులు నాగ చైతన్య, అఖిల్ గురించి అమల గర్వంగా మాట్లాడారు. "వాళ్లు ఇద్దరూ అద్భుతమైన యువకులుగా ఎదిగారు. నాగార్జున గారికి వాళ్లపై అపారమైన ప్రేమ ఉంది. నేను నా బాధ్యతల పట్ల కచ్చితంగా ఉంటాను. పిల్లల విషయంలో ఎప్పుడు నిర్లక్ష్యం వహించను అని పేర్కొన్నారు.నాగార్జున 1984లో లక్ష్మీ దగ్గుబాటిని వివాహం చేసుకున్నారు. 1990లో విడిపోయిన తర్వాత 1992లో నటి అమల అక్కినేనిని వివాహం చేసుకున్నారు. నాగ చైతన్య 2024లో నటి శోభిత ధూళిపాల ను వివాహం చేసుకున్నారు. హైదరాబాద్‌లో జరిగిన ఆ వేడుకకు టాలీవుడ్ ప్రముఖులు హాజరయ్యారు. ఇక 2025లో అఖిల్ అక్కినేని, ముంబైకి చెందిన ఆర్టిస్ట్, ఎంట్రప్రెన్యూర్ జైనబ్ ను పెళ్లి చేసుకున్నారు. ఇటీవల సినిమాల కంటే కుటుంబ జీవనాన్ని ఆస్వాదిస్తున్న అమల, తన ఫ్యామిలీతో సంతోషంగా గడుపుతున్నారు. "ఇప్పటి నా జీవితం ప్రశాంతంగా, ఆనందంగా సాగుతోంది" అంటూ ఇంటర్వ్యూను ముగించారు అమల.

## రాజాసాబ్ మరోమారు విడుదల వాయిదా




ప్రభాస్ హీరోగా మారుతీ డైరెక్షన్ లో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టి.జి. విశ్వప్రసాద్ నిర్మించిన 'ద రాజాసాబ్' మూవీ పలు రిలీజ్ డేట్స్ మార్చుకుంది. ప్రస్తుతం సంక్రాంతి కానుకగా జనవరి 9వ తేదీన 'ద రాజాసాబ్' రానుందని వినిపిస్తోంది. అయితే ఈ డేట్ కూడా మారే అవకాశం ఉందని, ఈ సినిమా ఏకంగా సమ్మర్ కు షిఫ్ట్ అవుతోందని ఓ టాక్ వినిపిస్తోంది. దీంతో ప్రభాస్ ఫ్యాన్స్ అయోమయంలో పడ్డారు. ఎందుకంటే ఈ సినిమాతో పాటు ప్రభాస్ అంగీకరించిన చిత్రాల పరిస్థితి ఏంటనీ అభిమానులు తికమకలో ఉన్నారు. అయితే ప్రభాస్ ఓ పక్కా ప్రణాళికతో ముందడుగు వేస్తున్నారని కాబట్టి ఏ లాంటి ఆందోళన చెందవలసిన




పనిలేదని సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. 'ద రాజాసాబ్' పోస్ట్ పోన్ అవుతుందన్న మాట వినిపించడానికి ఓ కారణం ఉందని కొందరు చెబుతున్నారు. ఈ చిత్ర నిర్మాత టి.జి.విశ్వప్రసాద్ తమ నిర్మాణ సంస్థ ద్వారా టాప్ స్టార్స్ తో సినిమాలు తీసే ప్రయత్నంలో ఉన్నారు. అందులో భాగంగానే పవన్ కళ్యాణ్ తో ఓ మూవీ తీస్తాననీ అన్నారు. అంతేకాదు, పవన్ కళ్యాణ్ 'ఓజీ మూవీ రిలీజ్ అయినప్పుడు, సూపర్ హిట్ టాక్ తో సాగుతోన్న తమ 'మిరాయ్' మూవీని ఎత్తేసి మరీ 'ఓజీ' షోస్ వేయడానికి ఓకే చెప్పారు విశ్వప్రసాద్. ఈ నేపథ్యంలోనే రాబోయే సంక్రాంతి బరిలో చిరంజీవి, అనిల్ రావిపూడి కాంబోలో వస్తోన్న 'మన శంకర వరప్రసాద్ గారు' కోసం తమ 'ద రాజాసాబ్'ను పోస్ట్ పోన్ చేస్తున్నారనీ వినిపిస్తోంది. అయితే ప్రభాస్ మాత్రం 'ద రాజాసాబ్'ను పూర్తి చేసిన వెంటనే హను రాఘవపూడి డైరెక్షన్ లో తాను నటిస్తున్న 'ఫౌజీ' షూటింగ్ లో పాల్గొంటారు. ఆ తరువాత నవంబర్ లో సందీప్ రెడ్డి వంగా డైరెక్షన్ లో 'స్పిరిట్' మూవీలో ప్రభాస్ నటించబోతున్నారు. ఈ రెండు సినిమాలలో ఒకటి 2026 ద్వితీయార్థంలో, మరోటి 2027లో వస్తుందనీ అంటున్నారు. ఫౌజీ, స్పిరిట్' మూవీస్ తరువాత గతంలోనే తాను అంగీకరించిన 'కల్కి -2', 'సలార్-2' చిత్రాలనూ ప్రభాస్ పూర్తి చేయవలసి ఉంది. వీటిలో ఓ సీక్వెల్ ను 2026లోనే ఆరంభిస్తారట. ఆ తరువాత 2027లో మరో సీక్వెల్ కు ముహూర్తం పెడతారు. అంటే ఈ సీక్వెల్స్ లో ఒకటి 2027లో విడుదలవుతుంది, మరోటి 2028లో వస్తుందని తెలుస్తోంది. వీటితో పాటే ప్రశాంత్ వర్మ డైరెక్షన్ లో ప్రభాస్ ఓ మూవీ చేయనున్నారని సమాచారం. ఇదిలా ఉంటే 'ద రాజాసాబ్' రిజల్ట్ ను బట్టి ఆ సినిమాకు కూడా సీక్వెల్ చేసే యోచన ఉందని అంటున్నారు.. ఇదే జరిగితే తెలుగునాట ప్రభాస్ 'సీక్వెల్ స్టార్'గా జేజేలు అందుకొనే పరిస్థితి నెలకొంటుంది.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. rni. no: TELTEL/2023/88215